## నేటి కందం-నేటికి అందం

**సింగూరును, మంజీరను**
**పొంగిన మానసముతో ప్రభుత్వమ్ము మొగిన్**
**చెంగున సందర్శించె తె**
**లంగాణము లోని నీటి లభ్యత నెంచన్ !!**

(తెలంగాణా రాష్ట్రంలో తాగునీటి లభ్యతను లెక్కించి సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం సింగూరు, మంజీరా ప్రాజెక్టులను దర్శించి పరిష్కార మార్గాలు చేపట్టింది. అవసరమైతే మల్లన్నసాగర్ లోని నీటిని కూడా ప్రజల అవసరాలకు వాడుకునే విధంగా ఏర్పాట్లు చేస్తామని ప్రకటించడంతో ప్రజలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com  ఎడిటర్: బైస దేవదాస్  సెల్:9000065433  E-mail:netinijam93@gmail.com

**చురక**

ప్రభుత్వం దిగాలనీ
ప్రజలంటే తప్పేంటి
మంచి చేస్తే ఎన్నికల్లో
మళ్లొస్తరు ముప్పేంటి
ఎమర్జెన్సీ మీరు నాడు
ఎండగడితే దేశ భక్తి
విపక్షాలు అదే నేడు
విమర్శిస్తే ద్రోహ శక్తి



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శనివారం 17-10-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:66 పేజీలు:6 వెల: రూ.1/-


# రష్యాలో భారీ భూకంపం..

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 16: రష్యా తూర్పు ప్రాంతంలో ప్రకృతి మరోసారి తన ప్రతాపం చూపించింది. కమ్చట్కా ద్వీపకల్పంలో శుక్రవారం తీవ్రమైన భూకంపం సంభవించింది. యూరోపియన్-మెడిటరేనియన్ సీస్మోలాజికల్ సెంటర్ అందించిన సమాచారం ప్రకారం.. రిక్టర్ స్కేలుపై ఈ భూకంప తీవ్రత 7.0 గా నమోదైనట్లు అధికారికంగా వెల్లడించారు. స్థానిక కాలమానం ప్రకారము మధ్యాహ్నం సుమారు 3:35 గంటల సమయంలో ఈ ప్రకంపనలు మొదలయ్యాయి. ఫార్ ఈస్ట్ ప్రాంతంలోని ప్రముఖ నగరమైన విల్యూచిన్స్కకు నైరుతి దిశగా సుమారు 123 కిలోమీటర్ల దూరంలో దీని కేంద్రాన్ని గుర్తించారు. భూ ఉపరితలానికి దాదాపు 140 కిలోమీటర్ల లోతులో ఈ భూకంపం కేంద్రీకృతమైనట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

'రింగ్ ఆఫ్ ఫైర్' ప్రభావం:

ప్రపంచంలోనే అత్యంత భూకంప ప్రభావిత ప్రాంతంగా పేరుగాంచిన పసిఫిక్ 'రింగ్ ఆఫ్ ఫైర్' వలయ ప్రాంతంలో కమ్చట్కా ద్వీపకల్పం ఉంది. ఇక్కడ టెక్టానిక్ ప్లేట్ల మధ్య నిరంతరం ఘర్షణలు జరగడం వల్ల తరచూ భారీ భూకంపాలు, అగ్నిపర్వతాలు బద్దలవుతుంటాయి. గతేడాది (2025) జులై నెలలో కూడా ఇదే తీర ప్రాంతంలో 8.8 తీవ్రతతో భారీ భూకంపం వచ్చి సునామీ ముప్పునకు దారితీసింది.

నష్టం, సునామీ హెచ్చరికలపై అస్పష్టత

భూకంప తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ, ఇది భూమికి సుమారు 140 కి.మీ లోతులో సంభవించడం గమనార్హం. దీనివల్ల తీరప్రాంతాల్లో జరిగిన ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా అధికారులకు అందాల్సి ఉంది. అలాగే సముద్ర అలల కల్లోలం, సునామీ హెచ్చరికల జారీపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. స్థానిక యంత్రాంగం పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది.

# కాంగ్రెస్, మిత్రపక్షాలపై రాజ్‌నాథ్ సింగ్ ఆరోపణలు

**యువత శక్తిని దేశ నిర్మాణానికి కాకుండా రాజకీయ ఘర్షణలకు వాడుకుంటున్నారని విమర్శ**
**బంగ్లాదేశ్ తరహా పాలన మార్పు ప్రయత్నాలంటూ వ్యాఖ్యలు**
**ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపణ**
**ఢిల్లీలో తాజా పరిణామాలపై పలు ప్రశ్నలు లేవనెత్తిన రాజ్‌నాథ్ సింగ్**



న్యూ ఢిల్లీ, అక్టోబర్ 16:ఢిల్లీలో గత కొద్ది రోజులుగా చోటుచేసుకున్న పరిణామాలు అనేక తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. యువత శక్తిని దేశ నిర్మాణానికి వినియోగించకుండా, రాజకీయ ఘర్షణలు, అశాంతిని సృష్టించేందుకు కాంగ్రెస్, దాని రాజకీయ మిత్రపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు.

యువతను అశాంతి రాజకీయాలకు పావులుగా మార్చాలని చూస్తున్నారని విమర్శించారు. బంగ్లాదేశ్ తరహాలో పాలన మార్పును తీసుకురావాలన్నది వారి లక్ష్యమని ఆరోపించారు. కొందరు బహిరంగంగానే బంగ్లాదేశ్ పరిణామాల నుంచి స్ఫూర్తి పొందామని చెబుతుండగా, మరికొందరు ప్రభుత్వాన్ని కూల్చాలని వ్యాఖ్యానిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరిచి, దేశంలో అశాంతిని సృష్టించడమే వారి ఏకైక అజెండాగా కనిపిస్తోందని రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు.

ప్రజాస్వామ్యం అంటే అశాంతిని సృష్టించడానికి, రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీయడానికి, దేశాభివృద్ధి ప్రయాణానికి అడ్డంకులు కల్పించడానికి లభించిన లైసెన్స్ కాదని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. రాహుల్ గాంధీ, ఆయన సహచరులు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు నిన్న చేసిన వ్యాఖ్యలు కూడా ఇదే దిశను సూచిస్తున్నాయని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. శాంతిభద్రతలను కాపాడటానికి చట్టాన్ని గౌరవించడం అత్యవసరమని స్పష్టం చేశారు. రాజకీయ స్వప్రయోజనాల కోసం భారత ప్రజాస్వామ్య సంస్థలను బలిచేయలేమని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈ వాస్తవాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు.

# డిండి ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేయాలి.. లేదంటే పోరాటం తప్పదు: డీకే అరుణ



మహబూబ్‌నగర్, అక్టోబర్ 16: పాలమూరు రైతుల నోట్లో మట్టికొట్టేలా డిండికి పాలమూరు లిఫ్ట్ నీటిని తరలించాలని చూస్తున్నారని ఎంపీ డీకే అరుణ వ్యాఖ్యానించారు. ఈరోజు(శుక్రవారం) పాలమూరు- రంగారెడ్డి పెండింగ్ ప్రాజెక్ట్‌లపై భారతీయ జనతా పార్టీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. జిల్లా ప్రజలకు మేలు చేయని సీఎం కుర్చీ రేవంత్ రెడ్డికి ఎందుకని ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డిజైన్ మార్పు వల్ల మోసం జరుగుతుందని అన్నారు.

10 ఏళ్లు అధికారంలో ఉండి కేసీఆర్.. ఆర్డీఎస్‌కు చేసిందేమీ లేదని విమర్శించారు. పాలమూరు జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రైతులపై, పెండింగ్ ప్రాజెక్టులపై ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. డిండి ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేయాలని.. లేదంటే జిల్లాలో పెద్దఎత్తున బీజేపీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని ఎంపీ డీకే అరుణ హెచ్చరించారు.

# చైర్మన్ అభ్యర్థుల నామినేషన్ల వేళ భగ్గుమన్న రాజకీయం..

**పట్టణంలో తీవ్ర ఉద్రిక్తత.. భయాందోళనలో ప్రజలు**





హైదరాబాద్, అక్టోబర్ 16:మున్సిపల్ ఎన్నికల వేళ పుంగనూరులో మరోసారి రాజకీయ కక్షలు భగ్గుమన్నాయి. నామినేషన్ల ప్రక్రియకు వేదిక కావాల్సిన బసవరాజ హైస్కూల్ ప్రాంగణం ఘర్షణలతో అట్టుడికింది. చైర్మన్ అభ్యర్థుల నామినేషన్ల సందర్భంగా రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కాన్వాయ్‌పై దాడి జరిగింది.

రాళ్లు, కర్రలతో దాడులు.. వాహనాల ధ్వంసం.. కార్యకర్తలకు గాయాలు.. వెరసి పట్టణంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఏడు ఎస్‌యూవీ వాహనాలను ధ్వంసం చేయడంతోపాటు కొన్ని వాహనాలను బోల్తా కొట్టించిన ఘటన రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది. గతంలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న ఘర్షణలను ఈ పరిణామాలు గుర్తు చేస్తున్నాయి. అధికారం మారినా పుంగనూరులో ఎన్నికల రాజకీయం తీరు మారలేదన్న చర్చకు తాజా ఘటన ఆజ్యం పోసింది.

**కాన్వాయ్‌పై విరుచుకుపడ్డ కూటమి శ్రేణులు.. 7 కార్లు ధ్వంసం!**

పుంగనూరు మున్సిపల్ చైర్మన్ పదవికి పోటీ చేస్తున్న మహిళా అభ్యర్థులతో నామినేషన్లు దాఖలు చేయించేందుకు ఎంపీ మిథున్‌రెడ్డి బసవరాజ హైస్కూల్ ప్రాంగణానికి చేరుకున్న సమయంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. అక్కడ మోహరించిన కూటమి, టీడీపీ శ్రేణులు ఆయన కాన్వాయ్‌ను చుట్టుముట్టి దాడికి దిగినట్లు వైసీపీ వర్గాలు ఆరోపించాయి. ఈ క్రమంలో రాళ్లు, కర్రలతో దాడులు జరిగాయని, వాహనాల అద్దాలను పగలగొట్టారని పేర్కొన్నాయి. వరుసగా నిలిపి ఉంచిన ఏడు ఎస్‌యూవీ వాహనాలు ధ్వంసం కాగా, కొన్ని వాహనాలను పక్కకు బోల్తా కొట్టించినట్లు అక్కడ పరిస్థితి తెలపుతోంది. దీంతో నామినేషన్ల కేంద్రం పరిసరాల్లో ఒక్కసారిగా కలకలం రేగింది. అయితే, ఘటనకు సంబంధించి ఇరువర్గాల వాదనలు, పోలీసుల అధికారిక నిర్ధారణ ఆధారంగా దాడికి బాధ్యులెవరన్నది తేలాల్సి ఉంది.

ఆకస్మిక ఘర్షణతో నామినేషన్ల కేంద్రం పరిసరాల్లో గందరగోళం నెలకొంది. దాడిని అడ్డుకునే క్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు గాయపడినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. వాహనాల ధ్వంసం, ఇరువర్గాల మధ్య ఉద్రిక్తతతో నామినేషన్ల ప్రక్రియకు అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ, పట్టణంలో ఉద్రిక్తత కొనసాగడంతో ప్రజలు, వ్యాపారులు ఆందోళనకు గురయ్యారు. ఎన్నికల నామినేషన్ల వంటి ప్రజాస్వామ్య ప్రక్రియకు భద్రత కల్పించాల్సిన సమయంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కించింది.

పుంగనూరు రాజకీయాల్లో గత ఎన్నికల నాటి పరిణామాలు మరోసారి చర్చకు వస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ప్రతిపక్ష అభ్యర్థులకు నామినేషన్ల విషయంలో అడ్డంకులు సృష్టించారంటూ అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. పెద్దిరెడ్డి వర్గం ఆధిపత్యం, ఏకగ్రీవాల వ్యవహారంపై ప్రత్యర్థి పార్టీలు తీవ్ర విమర్శలు చేశాయి. ఇప్పుడు అధికారం మారిన నేపథ్యంలో వైసీపీ అభ్యర్థుల నామినేషన్ల సందర్భంగా ఘర్షణలు చోటుచేసుకోవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. గతంలో తమకు ఎదురైన పరిస్థితులనే ఇప్పుడు ప్రత్యర్థులు ఎదుర్కొంటున్నారా.. అన్న ప్రశ్న రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. అయితే, నాటి ఘటనలకు, తాజా దాడికి మధ్య సారూప్యత ఉందన్న రాజకీయ వ్యాఖ్యలు ఒకవైపు ఉండగా, ప్రస్తుత ఘటనలో వాస్తవాలేమిటన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

ఎన్నికల్లో ప్రజల మద్దతు పొందాల్సిన రాజకీయ పార్టీలు బలప్రదర్శనకు దిగితే ప్రజాస్వామ్య ప్రక్రియకే విఘాతం కలుగుతుంది.

నామినేషన్లు దాఖలు చేసుకునే అభ్యర్థులకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించడం అధికార యంత్రాంగం బాధ్యత. పుంగనూరులో చోటుచేసుకున్న పరిణామాలపై ఎన్నికల సంఘం, పోలీసు ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఎన్నికల పోటీ రాజకీయంగా ఉండాలి తప్ప, భౌతిక దాడులు, వాహనాల విధ్వంసం వరకు చేరకూడదన్న అభిప్రాయం పట్టణంలో వ్యక్తమవుతోంది.

# డిమాండ్లను పరిష్కరించాలి



కరీంనగర్, అక్టోబర్ 16: తెలంగాణ ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా. భోగ శ్రావణి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ వద్ద ఎన్హెచ్ఎం జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక సమ్మెకు ఆమె సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

20 ఏళ్లుగా సేవలందిస్తున్న ఎన్హెచ్ఎం ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. వారిపై పని భారాన్ని తగ్గించి, అలవెన్సులు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం మానవీయ దృక్పథంతో వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కాసెట్టి తిరుపతి, మున్సిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్, వాణిజ్య సెల్ కన్వీనర్ సిరిపురం శ్రీనివాస్, గట్టిపెల్లి జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల రీల్స్‌పై డీజీపీ సీరియస్..

**ఉల్లంఘిస్తే క్రమశిక్షణా చర్యలు: డీజీపీ సీవీ ఆనంద్**



హైదరాబాద్, అక్టోబర్ 16: పోలీస్ యూనిఫామ్ ధరించి ప్రైవేటు కార్యక్రమాల్లో డ్యాన్సులు చేయడం, సోషల్ మీడియాలో రీల్స్ చేయడంపై తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరికలు జారీ చేశారు. యూనిఫామ్‌లో ఉన్నప్పుడు నిబంధనలను ఉల్లంఘించి అనధికార కార్యక్రమాల్లో పాల్గొంటే కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఇటీవల, కొంతమంది పోలీసు సిబ్బంది వివాహాలు, ఇతర ప్రైవేట్ కార్యక్రమాల్లో యూనిఫాం ధరించి డ్యాన్సులు చేస్తున్న వీడియోలను రూపొందిస్తున్నారు. సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఇటువంటి వీడియోలు కొన్ని సందర్భాల్లో వైరల్‌గా మారాయి. ఈ ధోరణి, పోలీసు విభాగంలో ఉండాల్సిన క్రమశిక్షణ, యూనిఫామ్‌కు ఇవ్వాల్సిన గౌరవంపై చర్చకు దారితీస్తుందని డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరించారు.

పోలీసు యూనిఫాం అనేది కేవలం దుస్తులు మాత్రమే కాదని, అది అధికారం, బాధ్యత, క్రమశిక్షణలకు ప్రతీక అని డీజీపీ పేర్కొన్నారు. ధరించినప్పుడు సిబ్బంది వృత్తిపరమైన హుందాతనాన్ని పాటించాలని డీజీపీ సూచించారు. యూనిఫామ్ గౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విధి నిర్వహణలోనే కాకుండా యూనిఫామ్ ధరించిన సందర్భాల్లోనూ పోలీసు శాఖ ప్రతిష్ఠను కాపాడాలని, ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెరిగేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. అధికారిక సాంస్కృతిక కార్యక్రమాలు, వేడుకలకు ఈ ఆదేశాలు వర్తిస్తాయా అనే అంశంపై మాత్రం స్పష్టత లేదు.

# అమెరికా స్కూల్‌లో కాల్పుల ఘటన.. ముగ్గురు చిన్నారులు మృతి

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 16:అమెరికాలోని ఓరేగాన్ రాష్ట్రంలో దారుణం జరిగింది. ఓ 16 ఏళ్ల వ్యక్తి కాల్పులకు తెగించాడు. ఈ ఘటనలో ముగ్గురు చిన్నారులు, ఓ టీచర్ మృతిచెందారు. ప్రైమరీ స్కూల్(రాఇఙష్ట్రనీనీశ్రీ ూష్ట్రనీనీబితినిణ)లో ఈ ఘాతుకం జరిగింది. అయితే ఆ ఉన్మాదిని మరో వ్యక్తి హతమార్చినట్లు పోలీసులు చెప్పారు. బెండ్ సిటీలో ఉన్న సిల్వర్ రైల్ ఎలిమెంటరీ స్కూల్‌లోకి అనుమానిత వ్యక్త దూసుకెళ్లాడు. అతని పేరును పోలీసులు వెల్లడించలేదు. మృతిచెందిన పిల్లల వయసు 11 ఏళ్ల లోపే ఉన్నది. ఈ ఘటనలో గాయపడ్డ 54 ఏళ్ల టీచర్ క్రిటికల్‌గా గాయపడింది. అయితే కాల్పులు జరిపిన వ్యక్తికి, స్కూల్‌కు ఏదైనా సంబంధం ఉందా లేదా అన్న కోణంలో విచారణ చేపడుతున్నారు.




# పేదరికం ఓ బహు వ్యాధి లక్షణం?!

## (17 అక్టోబర్ "అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం" సందర్భంగా)

8.2 బిలియన్ల ప్రపంచ మానవాళిని పట్టి పీడిస్తున్న పలు సమస్యలకు పేదరికమే ప్రధాన కారణమని, పేదరికం ఓ బహువ్యాధి లక్షణంగా మారిందని మనకు తెలుసు. మానవాళి ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన నిరక్షరాస్యత, అధిక జనాభా, ప్రజారోగ్యం, అసమానతలు, లింగ వివక్ష, పర్యావరణ కాలుష్యం, నిరుద్యోగం, పారిశుద్ధ్యలోపం లాంటి అంశాలు పేదరికంతో సమీప సంబంధాన్ని కలిగి ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా 108కి పైగా దేశాలకు సంబంధించిన 6.3 బిలియన్ (630 కోట్లు) ప్రజల "ప్రపంచ బహుమితీయ పేదరిక సూచిక"లను ఐరాస అనుబంధ సంస్థలు అధ్యయనం చేసి నివేదికను రూపొందించడం జరిగింది. "ఐరాస డెవలప్‌మెంటల్ ప్రోగ్రామ్ (యూఎన్‌డిపి)", "ఆక్స్‌ఫర్డ్ పావర్టీ అండ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్(ఓపిహెచ్ఐ)"లు సంయుక్తంగా ఈ నివేదికను తయూరు చేశాయి. గృహ వసతులు, పారిశుద్ధ్యం, విద్యుత్తు సరఫరా, వంట గ్యాస్/ఇంధనాలు, పోషకాహారం, విద్యార్థుల పాఠశాలల హాజరు లాంటి ప్రధాన అంశాలను అధ్యయనం చేసిన పిదప "బహుమితీయ పేదరిక సూచిక-2026 (మల్టీడైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్, ఎంపిఐ-2026)"లను నిర్ణయించి నివేదిక రూపొందించారు.

### అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం:

1992లో ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానం ఆధారంగా ప్రతి ఏటా 17 అక్టోబర్ రోజున ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవాన్ని" అధికారికంగా 2008 నుంచిజరుపుకోవడం ఆనవాయితీగా మారింది. 17 అక్టోబర్ 1987 రోజు పారిస్‌లో లక్షలాది ప్రజలు ఆకలి, పేదరికం, హింసకు వ్యతిరేకంగా గళం ఎత్తడంతో దానికి గుర్తుగా 17 అక్టోబర్ రోజును నిర్ణయించారు. 2026 అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం ఇతివృత్తంగా "అందరికీ సురక్షితమైన గృహాలు (సేఫ్టీ హోమ్స్ ఫర్ ఆల్)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది. 1997-2006 మధ్య తొలిసారి "ఐక్యరాజ్య సమితి పేదరిక నిర్మూలన దశాబ్దం"గా నిర్ణయించి పలు కార్యక్రమాలు చేపట్టడం చూసాం. పేదరికాన్ని ఏడు రకాలుగా విభజించారు. తీవ్రమైన, సాపేక్ష, గ్రామీణ, పట్టణ, పరిస్థితుల ఆధార, దీర్ఘకాలిక బహుమితితో పేదరికాలను అధ్యయనం చేస్తున్నారు,

### అల్ప, మధ్యాదాయ దేశాల్లో కోరలు చాస్తున్న పేదరికం:

పారిశుధ్యలోపంతో 828 మిలియన్లు, గృహ వసతులు లేని వారు 886 మిలియన్లు, వంట గ్యాస్ లేని వారు 998 మిలియన్లు ఉన్నారని, 110 కోట్ల ప్రపంచ పేదల్లో 637 మిలియన్ల పేద పిల్లలకు పోషకాహారం అందడం లేదని వెల్లడవుతున్నది. దక్షిణ ఆసియాలో 272 మిలియన్లు, సబ్-సహారా ఆఫ్రికా ప్రాంతాల్లో 256 మిలియన్ల పేదలకు కనీస పోషకాహారం అందడం లేదని తెలుస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా 83.2 శాతం పేదలు సబ్-సహారా, దక్షిణ ఏసియా ప్రాంత దేశాల్లోనే ఉన్నారని పేర్కొనబడింది. అల్పాదాయ దేశాల్లో 34.8 శాతం, మధ్య ఆదాయ దేశాల్లో 65.2 శాతం మంది కడు పేదలు ఉన్నారని నివేదిక వెల్లడించింది. ప్రపంచ పేదల్లో 83.7 శాతం వరకు గ్రామీణ బడుగులే ఉన్నారని తేలింది. ప్రపంచ జనాభాలో 28 శాతం గ్రామీణులు, 6.6 శాతం పట్టణ ప్రాంత పేదలు ఉన్నట్లు నివేదిక తెలిపింది.

### ప్రపంచ పేదరిక కేంద్రంగా భారతం !

ప్రపంచవ్యాప్తంగా 108 అల్పాదాయ అభివృద్ధి చెందుతున్న దేశాలకు చెందిన 1.2 బిలియన్ల (18 శాతం జనాభా) ప్రజలు కడు పేదరికంలో మగ్గుతున్నారని, పేదరికం అత్యధికంగా భారత్, పాకిస్థాన్ దేశాల్లోనే ఉందని తాజాగా విడుదల చేసిన "ఐరాస ప్రపంచ బహుమితీయ పేదరిక సూచిక - 2026 (యూఎన్ గ్లోబల్ మల్టీడైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్-2026)" నివేదిక స్పష్టం చేస్తున్నది. అత్యధికంగా భారత్‌లో 234 మిలియన్లు, పాకిస్థాన్‌లో 93 మిలియన్లు, ఇథియోపియాలో 86 మిలియన్లు, నైజీరియాలో 74 మిలియన్లు, కాంగోలో 66 మిలియన్ల పేదలు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. ప్రపంచ పేదల్లో 48.1 శాతం ఈ ఐదు దేశాల్లోనే ఉన్నట్లు తేలింది. ఐరాస అధ్యయనం చేసిన దేశాల "బహుమితీయ పేదరిక సూచిక" జాబితాలో భారత్ 105వ స్థానంలో నిలిచింది. 18 ఏండ్ల లోపు వయస్సు కలిగిన కడు పేదలు దాదాపు 584 మిలియన్లు, అనగా 27.9 శాతం ఉండగా, పెద్దలు 13.5 శాతం ఉన్నట్లు వర్ణించబడింది. భారత పేదల్లో 13.7 శాతం జనాభా పోషకాహారలోపంతో, 35.5 శాతం ఐదేళ్ల లోపు పిల్లలు వయసుకు తగిన ఎత్తు లేకపోవడం (స్టంటెడ్ గ్రోత్), 18.7 శాతం ఎత్తుకు తగిన తక్కువ బరువు లేక పోవడం (వేస్టింగ్), 2.9 శాతం పిల్లలు ఐదేళ్ల లోపు అకాల మరణాల బారిన పడడం గమనించారు. తరతరాలుగా పోషకాహార లోపాలు, ఆర్థిక అసమానతలు, అవిద్య, అనారోగ్యాలు, లింగ వివక్ష లాంటి కారణాలే పేదరికం రూపంలో భారతాన్ని పట్టి పీడిస్తున్నది.

### విపత్తు/ఘర్షణాత్మక/యుద్ధ ప్రాంత దేశాలు:

2వ ప్రపంచ యుద్ధం తర్వాత 2023లోనే యుద్ధాలు/ఘర్షనలు/వివాదాస్పద ఘటనలు అధికంగా నమోదు అయ్యాయని, వీటి పర్యవసానంగా 117 మిలియన్ల ప్రజలు ఖాళీ చేతులతో వలసలు వెళ్లినట్లు, ఆకలి చావుల అంచున దీన స్థితుల్లో బతుకులు ఈడుస్తున్నట్లు తేలింది. ప్రపంచవ్యాప్త 110 కోట్ల పేదల్లో దాదాపు 40 శాతం వరకు, అనగా 455 మిలియన్ల ప్రజలు ఈ ప్రాంతాలకు చెందిన వారే అని పేర్కొనబడింది. వీటిలో 218 మిలియన్ల ప్రజలు యుద్ధ ప్రాంతాల్లో, 335 మిలియన్ల ప్రజలు ఘర్షనాత్మక ప్రాంతాల్లో, 375 మిలియన్లు అశాంతియుత సమాజ ప్రాంతాల్లో ఉన్నారని వివరించబడింది. 2023 నాటికి ఇజ్రాయిల్ దాడితో పాలస్తీనా గాజా ప్రాంత ప్రజలు 83 శాతం వలసల బాట పట్టారని, 60 శాతం వరకు ఇండ్లు నేల మట్టం అయ్యాయని స్పష్టం చేసింది. పేదరికానికి కారణాలను అధ్యయనం చేయడం, ఆయా కారణాలకు తగిన పరిష్కారాలకు పథక రచనల అమలు చేయడం, జీవన ప్రమాణాలను పెంచడం, గ్రామీణులకు కనీస వసతులు పెంచడం, పోషకాహార భద్రత కల్పించడం, నిలువ నీడను ఏర్పాటు చేయడం, పరిసరాల పరిశుభ్రతకు పెద్ద పీట వేయడం లాంటి చర్యలు ప్రపంచ పేదరికాన్ని, ముఖ్యంగా భారతదేశ పేదరికాన్ని అదుపు చేస్తాయని గమనించి ప్రభుత్వాలు/పౌర సమాజం/స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని కోరుకుందాం. పేదరికం లేని ప్రపంచ కలలను సాకారం చేసుకుందాం.



-మధుపాళీ
9949700037

# పాకిస్తాన్ నుంచి దిగుమతి అయిన 73,00,000 కిలోలకు పైగా రాతి ఉప్పును స్వాధీనం చేసుకున్న డీఆర్ఐ.. నలుగురి అరెస్టు



న్యూఢిల్లీ, అక్టోబర్ 16:భారత్ నిషేధించిన వస్తువులను, పాకిస్తాన్‌లో తయారు చేసిన, లేదా పాకిస్తాన్ నుంచి దిగుమతి చేసుకున్న వస్తు సామగ్రిని వంచనాత్మక పద్ధతులలో పెద్ద ఎత్తున చేరవేస్తున్న ఓ ముఠా గుట్టును రెవెన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ (డీఆర్ఐ) మరో సారి రట్టు చేసింది. "ఆపరేషన్ డీప్ మేనిఫెస్ట్'' పేరిట ఈ కార్యకలాపాలను నిర్వహించారు.

పాకిస్తాన్ నుంచి తెచ్చిన 295 కంటేనర్ల పారిశ్రామిక/హిమాలయన్ రాక్ సాల్టును డీఆర్ఐ పట్టుకుంది. 7,311 టన్నులున్న ఈ రాతి ఉప్పు మార్కెట్టు విలువ సుమారు రూ.30 కోట్లు ఉంటుంది. సరుకును శ్రీలంకలోని కొలంబో ఓడరేవు నుంచి తీసుకువచ్చారు. యుఏఈకి చెందిన సంస్థలు జారీ చేసిన చలానాలు, కల్పిత ధ్రువపత్రాలతో కళ్లు కప్పాలని చూసిన యత్నాన్ని భగ్నం చేశారు.

నిర్దిష్ట రహస్య సమాచారం అందడంతో, డీఆర్ఐ గత నెల 26 మొదలు ఈ నెల 11 మధ్య పక్షం రోజుల పాటు గాంధీధామ్, ఆదిపూర్, వెరావల్, పానిపట్, పుణే, పటియాలా, ఢిల్లీ, ముంబయిలలో సంబంధిత ప్రాంతాల్లో సోదాలను నిర్వహించింది.

ముంద్రా, కాండ్లా ఓడరేవుల గుండా 295 కంటేనర్లను తొమ్మిది దిగుమతి సంస్థలు నిషేధాజ్ఞలను ఉల్లంఘించి దేశంలోకి తీసుకువచ్చినట్లు దర్యాప్తులో బయటపడింది. ఈ 295 కంటేనర్లలోని 5 కంటేనర్లలో 140 మెట్రిక్ టన్నుల పారిశ్రామిక/హిమాలయన్ రాక్ సాల్టును గుర్తించారు. దీని విలువ రూ.24.41 లక్షలు అని లెక్కగట్టారు. ఈ సరుకును కాండ్లా ఓడరేవులో స్వాధీనం చేసుకున్నారు. దీనికి అదనంగా, దిగుమతిదారు సంస్థల బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.20.96 లక్షలను కూడా జప్తు చేశారు. ఈ సొమ్ము విక్రయాల ద్వారా అందిన సొమ్ము.

పాకిస్తానీ, యూఏఈ, శ్రీలంక, భారతీయ పౌరుల యాజమాన్యంలోని సంస్థలతో సంబంధం పెట్టుకుని ఓ అంతర్జాతీయ నెట్‌వర్క్ పనిచేస్తోందని ప్రాథమిక దర్యాప్తులో తేల్చారు. ఈ నెట్‌వర్క్ సరుకుకు సంబంధించిన పాకిస్తానీ మూలాలను దాచిపెట్టడానికి షిప్‌మెంటు, సహాయక పత్రాలను సమన్వయపరిచే పనిలో పడిందని తెలుసుకున్నారు. లావాదేవీలను సమర్థించుకోవడానికి దుబాయ్‌లోని సంస్థలు జారీ చేశాయంటున్న నకిలీ చలానాలను ఉపయోగించారు. షిప్‌మెంటుకు పాకిస్తాన్-శ్రీలంక లతో ఉన్న మూలాలకు సంబంధించి శ్రీలంక కస్టమ్స్ వద్ద దాఖలు చేసిన బిల్స్ ఆఫ్ లేడింగ్, కస్టమ్స్ డిక్లరేషన్లలో సామగ్రి మూల దేశం పాకిస్తాన్ అనీ, సరుకును భారతదేశానికి చేరవేస్తున్నారన్న వివరాలు స్పష్టంగా పొందుపరిచి ఉన్నాయి. దిగుమతిదారులు సమర్పించిన సిసలు ధ్రువపత్రాలు నకిలీవి అన్న సంగతి రుజువైంది. కస్టమ్స్ చట్టం-1962 నిబంధనల ప్రకారం నలుగురిని అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు దిగుమతిదారు సంస్థల యజమానులు/ భాగస్వాములు. ఒకరి వద్ద కస్టమ్స్ బ్రోకరు వద్ద ఉండే జి-కార్డు ఉంది. మరొకరు దుబాయి కేంద్రంగా పనిచేస్తున్న సరఫరాదారు సంస్థకు యజమాని. ఆ వ్యక్తి దిగుమతి సంస్థను తండ్రి పేరిట ఏర్పాటు చేసి, కార్యకలాపాలను కొనసాగిస్తున్నాడు.

కిందటి నెలలో ఇదే విధమైన మరో చర్యలో, డీఆర్ఐ నాసిక్‌లోని సీఎఫ్ఎస్ అమ్బడ్ లో 3,62,000 కిలోల పాకిస్తానీ ఎండు ఖర్జూరాలను పట్టుకుంది. వాటిని ముంబయి కేంద్రంగా పనిచేస్తున్న ఒక సంస్థ 13 కంటేనర్లలో దిగుమతి చేసుకుందని వెల్లడైంది.

అంతర్జాతీయ నెట్‌వర్కులు మూడో పక్షం దేశాల గుండా దిగుమతి చేసుకొని, మూల స్థానాన్ని గురించిన తప్పుడు ధ్రువీకరణలు పొందుపరిచి, అక్రమ వ్యాపార దస్తావేజులను పుట్టించడం, పారదర్శకం కాని ఆర్థిక వ్యవస్థల ద్వారా పాకిస్తానీ మూలాలు కలిగిన సామనును భారత్ దిగుమతివరవ్యైన నిషేధాన్ని విధించిన సామగ్రిని కళ్లుగప్పి కొత్త కొత్త పద్ధతుల్లో రవాణా చేస్తుంటే పైన ప్రస్తావించిన కేసులు ఆ కూపీని లాగాయి. ఇలాంటి నెట్‌వర్కులను డీఆర్ఐ పసిగట్టి, వాటి పైన ఉన్న ముసుగును తొలగిస్తోంది. భారత ఆర్థిక, సామాజిక ప్రయోజనాలను కాపాడటానికి డీఆర్ఐ నిబద్ధతతో వ్యవహరిస్తున్నది.

2025 ఏప్రిల్‌లో పహల్గామ్ ఉగ్రవాద దాడి జరిగిన తరువాత నుంచి పాకిస్తాన్‌లో తయారు చేసిన, లేదా పాకిస్తాన్ నుంచి రప్పించుకొనే, అక్కడి నుంచి ఎగుమతి అయ్యే అన్ని వస్తువులపై జాతీయ భద్రత, ప్రజా విధాన హితాలను కేంద్ర ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని 2025 మే నెల 2నాటి డీజీఎఫ్‌టీ నోటిఫికేషన్ నంబర్ 06/2025-26 ద్వారా ప్రత్యక్ష నిషేధాన్ని, పరోక్ష నిషేధాన్ని విధించింది.

## జీవీ మాల్‌లో అగ్నిప్రమాదం..

కర్నూలు అక్టోబర్ 16:భ: కర్నూలు నగరం నడిబొడ్డున ఉన్న జీవీ మాల్‌లో శుక్రవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటంతో మాల్ ముందు భాగం పూర్తిగా దగ్ధమైంది. అప్రమత్తమైన స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. సకాలంలో అగ్నిమాపక వాహనాలు చేరుకోవడంతో మంటలు మాల్ లోపలి ప్రాంతాలకు వ్యాపించకుండా పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో భారీగా ఆస్తినష్టం జరిగినట్లు మాల్ నిర్వాహకులు వెల్లడించారు. అయితే ఎంతమేర నష్టం వాటిల్లిందన్నది ఇంకా స్పష్టతకు రాలేదు.

దసరా పండుగ నేపథ్యంలో జీవీ మాల్‌కు గురువారం కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో వచ్చి వెళ్లారు. ప్రతిరోజు మాదిరిగానే వ్యాపార కార్యకలాపాలు ముగిసిన అనంతరం రాత్రి మాల్‌ను మూసివేసి నిర్వాహకులు వెళ్లిపోయారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున సుమారు 4. 4.30 గంటల సమయంలో మాల్ ముందు భాగంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు చర్యలు చేపట్టారు. మంటలు ముందు భాగానికే పరిమితం కావడంతో మాల్‌లోని ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా నివారించగలిగారు. దీంతో మరింత పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. అయితే ముందు భాగం పూర్తిగా దగ్ధం కావడంతో నిర్వాహకులకు గణనీయమైన నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది.

# ఐడీబీఐ బ్యాంక్ వ్యూహాత్మక పునర్వ్యవస్థీకరణకు ఆమోదం తెలిపిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, అక్టోబర్ 16:ఐడీబీఐ బ్యాంక్ లిమిటెడ్.. భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) నియంత్రణలో పనిచేసే ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంక్. బ్యాంక్ బలహీనమైన ఆర్థిక పరిస్థితి కారణంగా దానికి పదేపదే మూలధనాన్ని సమకూర్చటం (క్యాపిటల్ ఇన్ఫ్యూజన్) అవసరమైంది. ప్రారంభంలో కేంద్ర ప్రభుత్వం, ఆ తర్వాత ఎల్ఐసీ ఈ పని చేశాయి. బ్యాంక్‌కు ఉన్న నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ), నష్టాలను దృష్టిలో ఉంచుకొని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆ బ్యాంక్‌ను 2017 మే 5న 'ప్రాంప్ట్ కరెక్టివ్ యాక్షన్' (పీసీఏ) ఫ్రేమ్‌వర్క్ పరిధిలోకి తెచ్చి అనేక ఆంక్షలను విధించింది. బ్యాంక్ ఆర్థిక స్థితిగతులలో వచ్చిన మెరుగుదలను పరిశీలించిన అనంతరం కొన్ని షరతులు, నిరంతర పర్యవేక్షణకు లోబడి ఐడీబీఐ బ్యాంక్‌పై విధించిన ఆంక్షలను 2021 మార్చి 10 నాటి లేఖ ద్వారా ఆర్‌బీఐ తొలగించింది.

ఈ నేపథ్యంలో ఐడీబీఐ బ్యాంక్ లిమిటెడ్ వ్యూహాత్మక పునర్వ్యవస్థీకరణకు ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ) ఆమోదం తెలిపింది. ఈ ఉత్తర్వులకు అనుగుణంగా ఐడీబీఐ బ్యాంక్ లిమిటెడ్‌లోని మొత్తం 60.72 శాతం ఈక్విటీ వాటాను వ్యూహాత్మక కొను గోలుదారునికి విక్రయించాలని నిర్ణయించారు. ఇందులో భారత ప్రభుత్వం వాటా 30.48 శాతం కాగా ఎల్ఐసీ వాటా 30.24 శాతంగా ఉంటుంది. ఈ విక్ర యం తర్వాత భారత ప్రభుత్వానికి బ్యాంక్‌లో 15 శాతం, ఎల్ఐసీకి 19 శాతం వాటా ఉంటుంది.

ఈ సీసీఈఏ నిర్ణయాన్ని రెండు దశల పోటీ వేలం ప్రక్రియ ద్వారా అమలు చేశారు. ఇంటర్-మినిస్టీరియల్ గ్రూప్ (ఐఎంజీ), పెట్టుబడి ఉపసంహరణపై కార్యదర్శుల కోర్ గ్రూప్ (సీజీడీ), ప్రత్యామ్నాయ యంత్రాంగంతో (ఏఎం) కూడిన సాధికారత కలిగిన మంత్రుల బృందంతో కూడిన బహుళ-స్థాయి యంత్రాంగం దీని పర్యవేక్షణ వహించింది.

ఆసక్తి గల పక్షాల నుంచి 'ఆసక్తి వ్యక్తీకరణ'ను (ఈఓఐ) ఆహ్వానిస్తూ 07.10.2022న పీఐఎం (ప్రిలిమినరీ ఇన్ఫర్మేషన్ మెమోరాండమ్) జారీ అయింది. ఆర్‌బీఐ ద్వారా 'ఫిట్ అండ్ ప్రాపర్' అని ధ్రువీకరణ పొంది హోం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ) నుంచి భద్రతా క్లియరెన్స్ పొందిన పక్షాలు మాత్రమే బిడ్డింగ్ దశలో పాల్గొనడానికి అర్హత కలిగి ఉన్నాయి. వీటి కోసం అర్హత కలిగిన ఆసక్తిగల పక్షాల (క్యూఐపీలు) నుంచి సాంకేతిక, ఆర్థిక బిడ్లను ఆహ్వానిస్తూ 'రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్' (ఆర్ఎఫ్‌పీ) జారీ అయింది. ప్రారంభంలో ఈఓఐ సమర్పించిన ఐదు పక్షాల్లో నిర్దేశించిన అర్హతా ప్రమాణాలు, అనర్హత నిబంధనల ప్రకారం నాలుగు పక్షాలు అర్హత సాధించాయి. వీటిలో రెండు చివరకు తమ టెక్నో-ఫైనాన్షియల్ బిడ్లను సమర్పించి దీనికి అర్హత కలిగిన బిడ్డర్లుగా నిలిచాయి.

డిస్‌ఇన్వెస్ట్‌మెంట్‌కు సంబంధించిన కార్యదర్శుల కోర్ గ్రూప్ (సీజీడీ) సమగ్ర మూల్యాంకనం, ప్రత్యామ్నాయ యంత్రాంగం సిఫార్సులను పరిశీలించిన అనంతరం 14/10/2026న జరిగిన సమావేశంలో ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ) ఐడీబీఐ బ్యాంక్ లిమిటెడ్‌లోని 60.72 శాతం వాటా కొనుగోలుకు గాను 10955230 కెనడా ఇన్‌కార్పొరేషన్‌ను (మాతృ సంస్థ: ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ లిమిటెడ్) వ్యూహాత్మక కొనుగోలుదారుగా ఆమోదించింది. ఈ లావాదేవీ మొత్తం విలువ రూ. 52,878.0806181 కోట్లు (అక్షరాలా యాభై రెండు వేల ఎనిమిది వందల డెబ్బై ఎనిమిది కోట్ల ఎనిమిది లక్షల ఆరు వేల నూట ఎనభై ఒక్క రూపాయిలు). ఇందులో భారత ప్రభుత్వానికి చెందిన 30.48 శాతం ఈక్విటీ వాటా, ఎల్ఐసీకి చెందిన 30.24 శాతం ఈక్విటీ వాటా ఉన్నాయి.

ఇటువంటి లావాదేవీలలో బిడ్డింగ్ ప్రక్రియకు ముందస్తుగా ఎలాంటి ప్రామాణిక సూచిక ఉండదు. బిడ్డర్లు సొంతంగా విలువను లెక్కించి సీల్ చేసిన కవర్లలో అత్యంత రహస్యంగా తమ బిడ్లను సమర్పించారు. దీనికి సమాంతరంగా సంస్థకు ఉన్న సరైన విలువను నిర్ణయించడానికి స్వతంత్ర ఏజెన్సీలను నియమించారు. సమర్పించిన బిడ్లు సమంజసమేనా అన్న అంచనా వేయడానికి ఈ విలువను ప్రామాణికంగా ఉపయోగిస్తారు.

దీని కింద ఆర్థిక సంవత్సరం 2025-26లో ప్రాథమిక బిడ్లను ఆహ్వానించారు. సరిపోలిక కోసం ఆ సమయంలో ప్రతి షేరు రిజర్వ్ ధరను రూ. 94.42గా నిర్ణయించారు. ఈ ధర ప్రత్యక్షంగా, పరోక్షంగా మార్కెట్ ద్వారా ప్రభావితమైంది. 07.10.2022న పీఐఎం లేదా ఈఓఐ జారీ చేయడానికి ముందు చివరి ట్రేడింగ్ రోజున ఐడీబీఐ స్టాక్ విషయంలో ప్రభావితం కాని ముందస్తు ధర ప్రతి షేరుకు రూ. 42.40గా ఉంది. 08.01.2026న ప్రాథమిక బిడ్లను ఆహ్వానించడానికి ముందు చివరి ట్రేడింగ్ రోజున ప్రభావితమైన ధర ప్రతి షేరుకు రూ. 108.12గా ఉంది. ఆ సమయంలో నిర్ణయించిన రిజర్వ్ ధర కంటే ప్రాథమిక బిడ్లు తక్కువగా ఉన్నందున వాటికి ఆమోదం లభించలేదు. ప్రాథమిక బిడ్లు తిరస్కరణకు గురైనట్లు తెలిసిన వెంటనే మార్కెట్‌లో స్టాక్ ధర సర్దుబాటు అయి బిడ్ ధర అయిన రూ. 75 కంటే చాలా తక్కువకు పడిపోయింది.

తదనంతరం సామూహిక నిర్ణయాత్మక యంత్రాంగానికి ఇచ్చిన అధికారాలను ఉపయోగిస్తూ ఈ లావాదేవీ విలువను సాధ్యమైనంత వరకు పెంచే లక్ష్యంతో 2026-27 ఆర్థిక సంవత్సరంలో అర్హత కలిగిన బిడ్డర్ల నుంచి వారి అత్యుత్తమ ఆఫర్లను వెల్లడించే సీల్డ్ బిడ్లను ఆహ్వానించారు. 18.05.2026న అత్యుత్తమ ఆఫర్ల బిడ్లను ఆహ్వానించడానికి ముందు చివరి ట్రేడింగ్ రోజున ఐడీబీఐ స్టాక్ ధర ప్రతి షేరుకు రూ. 70.38గా ఉంది. పరిమిత స్థాయిలో ట్రేడింగ్ జరిగే ఐడీబీఐ స్టాక్ ధర తీవ్రమైన హెచ్చుతగ్గులకు లోనైంది. మూల్యాంకన వ్యవధిలో ఈ ధర గరిష్ఠంగా రూ. 118.38 కనిష్ఠంగా రూ. 61.01 మధ్య ఉంటూ నిర్ణయించిన ధర కంటే భిన్నంగా ఉంది. ఈ మార్కెట్ ధర సంస్థకు ఉన్న సహజమైన విలువతో సరిపోలనందున దానిని ప్రామాణికంగా పరిగణించలేదు. దీనికి బదులుగా ఈ సమస్యను అధిగమించేందుకు 'మార్కెట్ మల్టిపుల్ మెథడ్' ద్వారా సాపేక్ష మూల్యాంకనాన్ని ఉపయోగించి అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల 2026 మార్చి 31 నాటి ముగింపు ఖాతాల ఆధారంగా సంస్థకు ఉన్న న్యాయబద్ధమైన మార్కెట్ విలువను నిర్ణయించారు. దీనితో పాటు ఐడీబీఐ బ్యాంక్ 2026 మార్చి 31 నాటి ఆడిట్ అయిన ఖాతాల ప్రకారం భూములు, ఆస్తులతో సహా దృశ్య, అదృశ్య (ట్యాంజిబుల్, ఇన్‌ట్యాంజిబుల్) ఆస్తులు, అప్పులను పరిగణనలోకి తీసుకునే 'అసెట్ వ్యాల్యుయేషన్ పద్ధతి' ద్వారా సంస్థకు ఉన్న న్యాయబద్ధమైన నికర ఆస్తి విలువను నిర్ణయించారు. దీనికి అనుగుణంగా పైన చెప్పిన విధంగా రెండు స్వతంత్ర పద్ధతులను ఉపయోగిస్తూ రెండు ప్రొఫెషనల్ వ్యాల్యుయేషన్ ఏజెన్సీలు సంస్థకు ఉన్న న్యాయబద్ధమైన విలువను లెక్కించాయి. ఈ రెండు నివేదికల సగటు విలువ ప్రకారం ప్రతి షేరు ప్రామాణిక ధర రూ. 75.99గా నిర్ణయించారు. బిడ్డర్ సమర్పించిన అత్యుత్తమ బిడ్ ధర ప్రతి షేరుకు రూ. 81గా ఉంది. ఇది ప్రామాణిక ధరతో పాటు రెండు స్వతంత్ర ఏజెన్సీల మూల్యాంకనం కంటే ఎక్కువగా ఉండటంతో దీనిని అత్యంత సమంజసమైనదిగా భావించి ఆమోదించారు.విజయవంతమైన బిడ్డర్ తన వివరాలను 'ఆసక్తి వ్యక్తీకరణ' (ఈఓఐ) దశలో నిర్వహించిన 'ఫిట్ అండ్ ప్రాపర్' అంచనాకు అనుగుణంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు సమర్పించాల్సి ఉంటుంది.

అందులో నిర్దేశించిన నియంత్రణ నిబంధనల అమలుకు సంబంధించిన రోడ్ మ్యాప్‌ను కూడా అందజేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తయితే మన ఆర్థిక వ్యవస్థలోని ఆర్థిక రంగంలో ఇప్పటివరకు నమోదైన అతిపెద్ద ప్రత్యక్ష విదేశీ పెట్టుబడిగా (ఎఫ్‌డీఐ) ఇది నిలుస్తుంది.

భాషా సాంస్కృతిక శాఖ తెలంగాణ ప్రభుత్వం
గుంటూరు శేషేంద్రశర్మ మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో



మహాకవి శేషేంద్ర శత జయంతి
ప్రారంభోత్సవం
తేది: 22 అక్టోబర్, 2026 గురువారం, సాయంత్రం 6:00 గం.లకు
వేదిక: రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్, హైదరాబాద్.
అధ్యక్షులు : డా॥ నందిని సిధారెడ్డి, కవి, విమర్శకులు, పూర్వ తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు
ప్రారంభోపన్యాసం : డా॥ ఏనుగు నరసింహారెడ్డి, IAS, డైరెక్టర్, భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం
విశిష్ట అతిథి : డా॥ మండలి బుద్ధప్రసాద్, శాసనసభ్యులు, అవనిగడ్డ
వక్తలు : శ్రీ రజా హుస్సేన్, సీనియర్ పాత్రికేయులు, సాహితీ విమర్శకులు
ఆచార్య మాడభూషి శ్రీధరాచార్యులు, న్యాయశాస్త్ర కోవిదులు, మహీంద్రా స్కూల్ ఆఫ్ లా
డా॥ వెల్దండి శ్రీధర్, కవి, విమర్శకులు
శ్రీ బీరం సుందరరావు, కవి, విమర్శకులు
శ్రీ సబ్బని లక్ష్మీనారాయణ, కవి, విమర్శకులు
శ్రీ సంకేపల్లి నాగేంద్ర శర్మ, కవి, విమర్శకులు
సాత్యకి, కో-ఆర్డినేటర్ భాషా సాంస్కృతిక శాఖ

# హెల్ప్‌డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలి

## -బిజెపి మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్



ఖమ్మం, అక్టోబర్ 16: హైదరాబాద-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదుకు ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను పట్టభద్రులు సద్వినియోగం చేసుకోవాలని నారాయణపేట బీజేపీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. భాస్కర్, ఊట్కూర్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్ కోరారు. శుక్రవారం ఊట్కూర్ మండల కేంద్రంలోని శివాజీనగర్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు హెల్ప్‌డెస్క్‌ను వారు ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 వరకు డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించడంతో పాటు, అర్హులైన పట్టభద్రులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామి కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమేష్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మంతు, మాజీ మండల అధ్యక్షులు కృష్ణయ్య గౌడ్, లక్ష్మణ్, రమేష్, మాజీ ఉపాధ్యక్షులు రోషనప్ప, మండల ప్రధాన కార్యదర్శిలు తారా కృష్ణ, రణవీర్, బీజేవైఎం మండల అధ్యక్షులు మహేష్, పట్టణ అధ్యక్షులు తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

# అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం

## యువతకు ఆయన జీవితం స్ఫూర్తిదాయకం




కామారెడ్డి, అక్టోబర్ 16:(నేటినిజం ప్రతినిధి): భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న పురస్కార గ్రహీత, ప్రముఖ క్షిపణి శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని తెలంగాణ రచయితల వేదిక (తెరవే) కామారెడ్డి జిల్లా ప్రతినిధులు కొనియాడారు. గురువారం కామారెడ్డిలోని తెరవే జిల్లా కార్యాలయంలో అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా తెరవే ముఖ్య సలహాదారు కందుకూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. అబ్దుల్ కలాం భారతమాత ముద్దుబిడ్డ అని, దేశ శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎంతో గొప్పదని అన్నారు. నిరాడంబర జీవితం గడుపుతూ దేశ అత్యున్నత పదవిని అధిరోహించిన కలాం జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

'ఎన్నీల ముచ్చట్లు' సమన్వయకర్త గంగా ప్రసాద్ మాట్లాడుతూ.. అబ్దుల్ కలాం రచించిన వింగ్స్ ఆఫ్ ఫైర్ పుస్తకం యువతకు, శాస్త్రవేత్తలకు స్ఫూర్తినిస్తూ దిశానిర్దేశం చేస్తుందని అన్నారు. కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం కృషి చేయాలని ఆయన ఇచ్చిన సందేశాలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయని పేర్కొన్నారు.

తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్ మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబంలో జన్మించి, తన ప్రతిభ, పట్టుదల, కృషితో దేశ అత్యున్నత పదవిని అధిరోహించిన అబ్దుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శమని అన్నారు. యువత ఆయన జీవిత చరిత్రను చదివి స్ఫూర్తి పొందాలని, లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కష్టపడాలని సూచించారు.

కార్యక్రమంలో తెరవే జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లీ మోహన్‌రాజ్ పాటలు పాడి వినిపించారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనంలో కాసర్ల రామచంద్రం, వైద్య శేషారావు, నాగభూషణం, సంఘు గౌడ్, గంగా ప్రసాద్, బాలకృష్ణ, నాగరాజు తదితరులు తమ కవితలు, పాటలతో అబ్దుల్ కలాం సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమం సాహిత్యాభిమానుల్లో స్ఫూర్తిని నింపింది.

# మహాలక్ష్మి రైస్ మిల్లుపై విజిలెన్స్ దాడులు

## గతంలో మరో మిల్లుపై రూ.20 కోట్ల ధాన్యం బకాయిల ఆరోపణలు



మహబూబ్‌నగర్, అక్టోబర్ 15:నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రభుత్వ ధాన్యం నిల్వల కొరత మరోసారి వెలుగుచూసింది. నాగర్‌కర్నూల్ మండలం మంతటి గ్రామంలోని మహాలక్ష్మి పార్బాయిల్డ్ రైస్ మిల్లులో రూ.9.68 కోట్ల విలువైన ప్రభుత్వ ధాన్యం అందుబాటులో లేదని అధికారుల తనిఖీల్లో గుర్తించినట్లు సమాచారం. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌరసరఫరాల శాఖ అధికారులు గురువారం మిల్లుపై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు.

అధికారుల తనిఖీల్లో 94,370 ధాన్యం బస్తాలు మిల్లులో లేనట్లు గుర్తించినట్లు సమాచారం. వీటి విలువ సుమారు రూ.9.68 కోట్లుగా అంచనా వేశారు. అయితే, ధాన్యం కొరతకు సంబంధించి పూర్తి వివరాలు, లెక్కల పరిశీలనపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది.

ప్రభుత్వం 2022?2026 మధ్య వివిధ సీజన్లలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ప్రక్రియలో భాగంగా మిల్లులకు ధాన్యం కేటాయించింది. నిర్ణీత నిబంధనల ప్రకారం ఆ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బియ్యాన్ని ప్రభుత్వానికి తిరిగి అప్పగించాల్సి ఉంటుంది. అయితే, ధాన్యానికి సంబంధించిన బకాయిలు చెల్లించకపోవడం, బియ్యం అప్పగింతలో జాప్యం జరిగినట్లు అధికారులు గుర్తించిన నేపథ్యంలో తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. పలుమార్లు నోటీసులు ఇచ్చినా స్పందన లేకపోవడంతో తదుపరి చర్యలకు ఉపక్రమించినట్లు సమాచారం.

ఈ వ్యవహారంపై జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారులు పంచనామా నిర్వహించగా, మిల్లు యజమానులు ఆకుతోట సాయిబాబా, సుదర్శన్‌తో పాటు మరో పది మందిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం.

గత నెలలో తాడూరు మండలంలోని లక్ష్మీనరసింహస్వామి రైస్ మిల్లులోనూ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వానికి అప్పగించాల్సిన సుమారు రూ.20 కోట్ల విలువైన ధాన్యం బకాయిల వ్యవహారంలో ఆ మిల్లుకు సంబంధించిన వారిపైనా కేసు నమోదు చేసినట్లు సమాచారం.

ప్రభుత్వానికి అప్పగించాల్సిన ధాన్యం, బియ్యం బకాయిల వసూళ్లపై అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. గతంలో బకాయిల వసూళ్లలో జాప్యం జరిగిందన్న విమర్శల నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేసినట్లు సమాచారం. ప్రభుత్వ ధాన్యాన్ని తిరిగి రాబట్టేందుకు పౌరసరఫరాల శాఖ చర్యలు చేపడుతోంది.

# భారత్ బ్రూనై దారుస్సలాం ద్వైపాక్షిక వాణిజ్య-ఆర్థిక సహకారంపై సంయుక్త వాణిజ్య కమిటీ మూడో దఫా సమీక్ష

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 16:న్యూఢిల్లీలో ఇవాళ భారత్-బ్రూనై దారుస్సలాం సంయుక్త వాణిజ్య కమిటీ (జేటీసీ) మూడో సమావేశం నిర్వహించారు. ద్వైపాక్షిక వాణిజ్య-ఆర్థిక సహకారంపై సమీక్ష సహా వాణిజ్య సంబంధాల బలోపేతానికి మార్గాన్వేషణపై ఈ సందర్భంగా చర్చించారు. భారత్ తరపున వాణిజ్య-పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని వాణిజ్య విభాగం సంయుక్త కార్యదర్శి శ్రీ అమిత్ వర్మ, బ్రూనై దారుస్సలాం తరఫున ఆర్థిక-వాణిజ్య-పరిశ్రమల మంత్రిత్వశాఖ కార్యదర్శి డాక్టర్ మే ఫాయెజా అహ్మద్ అరిఫిన్ సహాధ్యక్షత వహించారు. వారితోపాటు రెండు దేశాల సంబంధిత మంత్రిత్వ శాఖలు-విభాగాలు-సంస్థల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

ద్వైపాక్షిక వాణిజ్య విస్తరణ, మార్కెట్ ప్రవేశ ప్రాథమ్యాల సమస్య పరిష్కారం, వాణిజ్య సంస్థల మధ్య ఆదానప్రదానాల సౌలభ్యం దిశగా సంస్థాగత యంత్రాంగాల గుర్తింపుపై ఈ చర్చల్లో ప్రధానంగా దృష్టి సారించారు. ఆహార భద్రతకు మద్దతు, వాణిజ్య వైవిధ్యం లక్ష్యంగా భారత్ నుంచి బ్రూనై దారుస్సలాం దేశానికి వ్యవసాయ-జంతు ఉత్పత్తుల ఎగుమతులను సరళీకరించడంపైనా ఉభయ పక్షాలు చర్చించాయి.

మరోవైపు ఔషధ, ఆరోగ్య సంరక్షణ, ఇంధన రంగాలలో మరింత విస్తృతికి గల అవకాశాలపై ఉభయ పక్షాలూ ఏకాభిప్రాయానికి వచ్చాయి. ఈ రెండు రంగాల్లో అధిక భాగస్వామ్యానికి వీలున్న అంశాలను గుర్తిస్తూ- నియంత్రణ సహకారం, కొనుగోళ్లు, ఆరోగ్య సంరక్షణ సేవల ప్రదానంపైనా అవకాశాలపై చర్చించారు. ఇంధన రంగానికి సంబంధించి నిరంతర పారిశ్రామికాభివృద్ధికి మద్దతు సహా సంప్రదాయ, అత్యాధునిక ఇంధన భాగస్వామ్యాలపై దృష్టి సారించారు.

పర్యాటక రంగంలో సహకారం, వాణిజ్య సమ్మేళనాలు, ప్రదర్శనలలో పాలు పంచుకోవడం ద్వారా ప్రజల మధ్య సంబంధాలతోపాటు వాణిజ్య విస్తరణ బలోపేతం ప్రాముఖ్యాన్ని కూడా ఉభయపక్షాలు ప్రస్తావించాయి. తయారీ, మౌలిక సదుపాయాలు, సేవల రంగాల్లో పెట్టుబడి అవకాశాల గుర్తింపు దిశగా లక్షిత వాణిజ్య ప్రోత్సాహక కార్యక్రమాలు, పరస్పర వ్యాపార ప్రతినిధి బృందాలు దోహదం చేస్తాయని ప్రతినిధులు పేర్కొన్నారు.

ఈ సమావేశంలో చర్చించిన మేరకు వాణిజ్య, పెట్టుబడి లక్ష్యాల సాకారంలో భాగంగా తదుపరి చర్యల పర్యవేక్షణ కోసం సంబంధిత నోడల్ ఏజెన్సీలు, వర్కింగ్ గ్రూపుల మధ్య నిరంతర సమాచార ఆదానప్రదానాన్ని కొనసాగించడంపై రెండు పక్షాలూ తమ నిబద్ధతను పునరుద్ఘాటించాయి. ఈ నేపథ్యంలో రెండు దేశాల సంయుక్త వాణిజ్య కమిటీ తదుపరి (4వ) సమావేశాన్ని బ్రూనై దారుస్సలాంలో నిర్వహిస్తారు.

# బహుళ-రాష్ట్ర సహకార సంఘాల కోసం కొత్త ఆడిట్ రిపోర్టింగ్ చట్రం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 16: దేశంలోని బహుళ-రాష్ట్ర సహకార సంఘాల (ఎంఎస్‌సీఎస్)లో పారదర్శకత, జవాబుదారీతనం, సుపరిపాలన బలోపేతం దిశగా కొత్త ఆడిట్ రిపోర్టింగ్ చట్రాన్ని కేంద్ర సహకార మంత్రిత్వశాఖ తప్పనిసరి చేసింది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రబోధిత 'సహకారంతో సమృద్ధి' సూత్రం ప్రాతిపదికగా కేంద్ర హోం-సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా నేతృత్వాన ఈ సహకార సంఘాలకు ఇప్పటికే ఇతోధిక ప్రోత్సాహం లభిస్తోంది. ఈ నేపథ్యంలో ఆర్థికంగా పటిష్టమై, వృత్తిగత పాలన నిర్వహణగల సహకార రంగం కోసం తీసుకున్న కీలక నిర్ణయమిది. తదనుగుణంగా "బహుళ-రాష్ట్ర సహకార సంఘాల (ఆడిటర్ నివేదిక) ఉత్తర్వు-2026 (ఎంఎస్‌సీఏఆర్‌ఓ)ను జారీ చేసింది. ఆయా సహకార సంఘాల్లోని సభ్యుల ప్రయోజనాలను పరిరక్షించడమే కాకుండా మరింత పారదర్శక, వృత్తిగత పాలనా నిర్వహణలోగల జవాబుదారీ సహిత సహకార వ్యవస్థకు రూపమివ్వడంలో ఈ ఉత్తర్వును ఓ కీలక ఘట్టంగా పరిగణించవచ్చు.

బహుళ-రాష్ట్ర సహకార సంఘాల (సవరణ) చట్టం-2023లోని సెక్షన్ 73(6) కింద 'ఎంఎస్‌సీఎస్'లకు ఆడిటింగ్-అకౌంటింగ్ ప్రమాణాలను నిర్దేశించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది. దీనికి అనుగుణంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సహా 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ), కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (సీఏజీ-కాగ్), 'ఎంఎస్‌సీఎస్'ల నుంచి అందిన సలహాలు-సూచనల ప్రాతిపదికన సహకార మంత్రిత్వశాఖ 'ఎంఎస్‌సీఏఆర్‌ఓ-2026'ను రూపొందించింది.

బహుళ-రాష్ట్ర సహకార సంఘాలలో చట్టబద్ధ ఆడిట్ నివేదన కోసం ప్రస్తుతం కార్పొరేట్ రంగానికి వర్తించే 'కంపెనీల (ఆడిటర్ నివేదిక) ఉత్తర్వు' (సీఏఆర్‌ఓ) తరహాలో దీనికి రూపమిచ్చారు. 'ఎంఎస్‌సీఎస్'లకు తగిన ఏకరూప, పటిష్ట, ముప్పు ఆధారిత చట్రాన్ని సమకూర్చడం ఎంఎస్‌సీఏఆర్‌ఓ లక్ష్యం. దీనికింద ఆయా సంఘాలలో కీలక ఆర్థిక, పరిపాలన, నిర్వహణ, చట్టబద్ధ అనుపాలనాంశాలపై 'అవును/కాదు' సమాధానాలతో పాటు సంబంధిత వ్యాఖ్యలను ఆడిటర్లు నిర్దిష్ట ప్రామాణిక నివేదికలో పొందుపరచాల్సి ఉంటుంది. తద్వారా ఆడిట్ నివేదనలో స్థిరత్వం ఇనుమడించి, అక్రమాల గుర్తింపు సులభం కావడమే కాకుండా నియంత్రణ-పర్యవేక్షణ బలోపేతం కాగలవు.

ముప్పు-ఆధారిత నియంత్రణ-పర్యవేక్షణలను ప్రవేశపెట్టడం ఈ చట్రంలోని ప్రధానాంశాలలో ఒకటి. దీనివల్ల ఆడిటర్ల పరిశీలన ఆధారంగా అధిక ఆర్థిక లేదా పాలనాపరమైన ముప్పు గల సంఘాలను కేంద్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ (సీఆర్‌సీఎస్) ముందుగానే గుర్తించే వీలుంటుంది. మరింత కేంద్రీకృత తనిఖీ, విచారణ, నియంత్రణ చర్యల సౌలభ్యం కూడా కలుగుతుంది. తద్వారా పర్యవేక్షణ సామర్థ్యం మెరుగుపడి, సకాలంలో దిద్దుబాటు చర్యలకు భరోసా లభిస్తుంది.

నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ), గడువు మీరిన రుణాలు, ద్రవ్య లభ్యత పరిస్థితులు, డిపాజిట్లు, అడ్వాన్సులు, రుణాల చెల్లింపులో వైఫల్యాలు, సంఘాల అప్పులు తదితరాలపై ఈ చట్రం ద్వారా క్రమపద్ధతిలో నివేదన సాధ్యమవుతుంది. తద్వారా ఆర్థిక భారాన్ని ముందస్తుగా గుర్తించి దిద్దుబాటుకు ఉపక్రమించే అవకాశం ఉంటుంది. ఇటువంటి సమాచార వెల్లడితో కొత్తగా తలెత్తే ఆర్థిక బలహీనతలను గుర్తించి, అవి మరింత తీవ్ర ఆర్థిక లేదా కార్యాచరణ సమస్యలుగా మారకముందే సకాలంలో నివారించవచ్చు.

సభ్యుల నిధులు, ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణ బలోపేతం సహా నిర్దేశిత ఆడిట్ నిబంధనల వల్ల పెట్టుబడులు, నిధుల వినియోగం, వాటా మూలధనం, సభ్యత్వ రికార్డులు, చట్టబద్ధ ఆమోదాల స్వతంత్ర ధ్రువీకరణకు వీలుండటం 'ఎంఎస్‌సీఏఆర్‌ఓ'లో మరో కీలకాంశం. ఆర్థిక లావాదేవీలు, సహకార వనరుల వినియోగంపై నిశిత పరిశీలనను ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక సమగ్రత బలోపేతం సహా సహకార సంస్థలపై సభ్యుల విశ్వాసం ఇనుమడించడంలో ఈ చట్రం దోహదపడుతుంది.

డైరెక్టర్ల బోర్డు కూర్పు, అర్హతానర్హతలు, వార్షిక సర్వసభ్య సమావేశాలు, బోర్డు సమావేశాల నిర్వహణ, చట్టబద్ధ కమిటీల ఏర్పాటు-పనితీరు, సంబంధిత పక్షాల లావాదేవీల సంబంధిత నిబంధనల అనుసరణలో క్రమబద్ధ పరిశీలన వగైరాలకు ఈ ఉత్తర్వు తోడ్పడుతుంది. తద్వారా సుపరిపాలన, సంస్థాగత జవాబుదారీతనం మరింత బలోపేతం కాగలవు. 'ఎంఎస్‌సీఎస్'లలో పారదర్శక నిర్ణయాలు, ప్రజాస్వామ్యబద్ధ పనితీరు, చట్టబద్ధ నిబంధనల పట్ల నిబద్ధతలను ప్రోత్సహించడం ఈ నిబంధనల ధ్యేయం.

ప్రామాణిక ఆడిట్ సమాచారాన్ని సీఆర్‌సీఎస్ పోర్టల్‌తో అనుసంధానించడం ద్వారా సాంకేతికత ఆధారిత నియంత్రణ-పర్యవేక్షణకూ ఎంఎస్‌సీఏఆర్‌ఓ వీలు కల్పిస్తుంది. ఇలాంటి అనుసంధానం వల్ల స్వయంచలిత పరిశీలన, నియంత్రణ డాష్‌బోర్డులు, రిస్క్ స్కోరింగ్, కృత్రిమ మేధ ఆధారిత విశ్లేషణల సౌలభ్యం కలుగుతుంది. సమర్థ పర్యవేక్షణ, నిబంధనల పాటింపులో పొరపాట్లు-తప్పుల గుర్తింపు నిదర్శనాధారిత నియంత్రణ చర్యలకు ఈ చట్రం భరోసానిస్తుంది.

ఈ చట్రం వర్తించే ప్రతిచోటా సైబర్ భద్రత, మనీలాండరింగ్ నిరోధక నిబంధనల పాటింపు వగైరాలను ఆడిట్ స్థాయిలోనే నిర్వహించవచ్చు. ఇందులో సైబర్ భద్రత-రక్షణ చర్యల పరిశీలన, అనుమానాస్పద లావాదేవీల నివేదన, వినియోగదారుల గుర్తింపు నిబంధనలు, మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద నియమిత డైరెక్టర్లు సహా ప్రధాన అధికారుల నియామక నిబంధనల పాటింపు వంటివి ప్రధానమైనవి. ఆర్థిక అక్రమాలు, సైబర్ ముప్పులు, ఇతర నిబంధనల అనుసరణలోని లోటుపాట్లపై సంస్థాగత రక్షణను ఈ చట్రం బలోపేతం చేస్తుంది.

ఈ చట్రం అమలుకు వీలుగా సహకార సంస్థలకు తమ అంతర్గత వ్యవస్థలు-ప్రక్రియల ఉన్నతీకరణ కోసం తగినంత సమయం ఇవ్వాల్సిన అవసరాన్ని మంత్రిత్వశాఖ గుర్తించింది. తదనుగుణంగా 'ఎంఎస్‌సీఏఆర్‌ఓ-2026'ను దశలవారీగా అమలు చేసేందుకు అనుమతిస్తూ ఆదేశాలు జారీచేసింది. సంబంధిత ఆర్థిక పారామితులలో నిర్దేశిత ?50 కోట్ల పరిమితిని అధిగమించిన బహుళ-రాష్ట్ర సహకార సంఘాలకూ ఈ చట్రాన్ని విస్తరించడం ఒక దీర్ఘకాలిక లక్ష్యం. అయితే, ప్రస్తుత తొలి దశలో ?1,000 కోట్ల వ్యాపార పరిమాణం దాటిన పెద్ద సొసైటీలకు దీన్ని వర్తింపజేస్తారు. దీనివల్ల నివేదన మెరుగుదలకు సిద్ధం కావడంలో చిన్న సంఘాలకు అదనపు సమయం లభిస్తుంది.

బహుళ-రాష్ట్ర సహకార సంఘాలు మరింత పారదర్శకంగా, వృత్తిగతంగా, జవాబుదారీతనంతో పనిచేసే సహకార వ్యవస్థలో భాగమయ్యేలా చేయడంలో 'ఎంఎస్‌సీఏఆర్‌ఓ-2026' కీలక మలుపు కాగలదు. ముప్పు ఆధారిత పరిశీలన, సాంకేతికత-ఆధారిత తనిఖీ-పర్యవేక్షణలతో ప్రామాణిక చట్టబద్ధ ఆడిట్ రిపోర్టింగ్‌ను జోడించడం ద్వారా సంస్థాగత విశ్వసనీయతను ఇది బలోపేతం చేస్తుంది. అదే సమయంలో సభ్యుల ప్రయోజనాల పరిరక్షణ, 'సహకారంతో సమృద్ధి' దార్శనికత మరింత విస్తరిస్తుంది.

# కరెంటు సరఫరాలో ప్రభుత్వం విఫలం

## పంటలు ఎండబెట్టి రైతులను గోసపెడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

## ఎండిన పంటలకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలి: మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్



కామారెడ్డి, అక్టోబర్ 16:(నేటినిజం ప్రతినిధి): రాష్ట్రంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంటలు ఎండిపోయి నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు గంప గోవర్ధన్ విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యుత్ సరఫరాలో విఫలమైందని ఆరోపించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

విద్యుత్ సరఫరాలో సమస్యలకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని గంప గోవర్ధన్ ఆరోపించారు. సమస్యలను పరిష్కరించకుండా అధికారులను బెదిరించడం, సస్పెండ్ చేయడం వల్ల ప్రయోజనం లేదన్నారు. ప్రభుత్వ విధానాలు, ముందస్తు ప్రణాళికలోని లోపాలను సరిదిద్దుకోవాలని సూచించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పరిశ్రమలకు, వ్యవసాయ రంగానికి నిరంతర విద్యుత్ సరఫరా అందించామని గంప గోవర్ధన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 7 వేల మెగావాట్ల నుంచి 20 వేల మెగావాట్ల స్థాయికి పెంచిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. భద్రాద్రి, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాలను కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సాగునీరు, విద్యుత్ రంగాలకు ప్రాధాన్యమిచ్చామని తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో రోజుకు ఆరు నుంచి ఏడు గంటలకే విద్యుత్ సరఫరా పరిమితమవుతోందని, దీంతో రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని గంప గోవర్ధన్ ఆరోపించారు. విద్యుత్ అందక పంటలు ఎండిపోతుండటంతో రైతులు జనరేటర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మాచారెడ్డి ప్రాంతంలోనూ కొందరు రైతులు జనరేటర్ల సాయంతో పంటలను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు.

విద్యుత్ సమస్యలపై రైతులు సబ్‌స్టేషన్ల వద్దకు వచ్చి ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. ఆదిలాబాద్‌లో రైతులు వినూత్న రీతిలో నిరసన తెలిపిన విషయాన్ని ప్రస్తావిస్తూ, రైతుల సమస్యలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు రికార్డులు లేకుండా బయటకు వెళ్లిందన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని గంప గోవర్ధన్ డిమాండ్ చేశారు. విద్యుత్ రంగానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు.

# సుందర్‌గఢ్ జిల్లాలో ఐదు సీఎస్ఆర్ ప్రాజెక్టుల కోసం రూ.22.64 కోట్లను కేటాయించిన ఎంసీఎల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 16:సీఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా రూ. 22.64 కోట్ల విలువైన ఐదు అభివృద్ధి ప్రాజెక్టుల కోసం మంగళవారం సుందర్‌గఢ్ జిల్లా పరిపాలన వ్యవస్థతో మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎంసీఎల్) ఎంఓయూలు కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టుల్లో కాటా బంధ (రూ. 4.32 కోట్లు), బ్రాహ్మణి బంధ (రూ. 3.98 కోట్లు), అబ్దుల్ హుస్సేన్ బంధ (రూ. 2.69 కోట్లు) వంటి వాటి పునరుజ్జీవనం, సుందరీకరణ, హేమ్‌గిర్ బ్లాక్‌లోని మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లో మంచినీటి జలశయాల్లో ఆక్వాకల్చర్ (రూ.3.81 కోట్లు), సుందర్‌గఢ్ జిల్లాలోని తల్సారా అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో చెరువుల పునరుద్ధరణ, అభివృద్ధి, నిర్మాణం (రూ. 7.84 కోట్లు) ఉన్నాయి.

జిల్లా పాలనా వ్యవస్థ ద్వారా ప్రాజెక్టు అమలుకు ఎంసీఎల్ జనరల్ మేనేజర్ (సీఎస్ఆర్), సుందర్‌గఢ్ జిల్లా కలెక్టర్ ఎంఓయూపై సంతకాలు చేశారు.

''అమృత్ సరోవర్ మిషన్''కు అనుగుణంగా నీటి వనరుల పునరుద్ధరణ ద్వారా నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ, పర్యావరణ పరిరక్షణతో పాటు ఆహ్లాదకరమైన పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, చిన్నతరహా పర్యాటకానికి ప్రోత్సాహం, స్థానిక ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయి. ఈ పనుల్లో జలాశయ కట్టల పరిరక్షణ, పాదచారులకు మార్గాల నిర్మాణం, స్నానపు మెట్లు, రాతి కట్టడాలు, రెయిలింగ్‌లు, కూర్చునే స్థలాలు, విద్యుత్ పనులు, హార్టికల్చర్ వంటివి మిషన్ అమృత్ సరోవర్‌కు అనుగుణంగా చేపడతారు.

ప్రధానమంత్రి ధన-ధాన్య కృషి యోజనకు అనుగుణంగా అక్వాకల్చర్ ప్రాజెక్టును అమలు చేయనున్నారు. దీని ద్వారా 50 కొత్త చెరువుల నిర్మాణం, 20 పాత చెరువుల పునరుద్ధరణతో 700 మందికిపైగా సన్నకారు రైతులకు, ఎఫ్‌పీఓ సభ్యులకు లబ్ధి చేకూరుతుంది.

ఇందులో భాగంగా మహిళల నేతృత్వంలో చేప విత్తనోత్పత్తి యూనిట్లు, అద్దె ప్రాతిపదికన యంత్రాలు అందించే కేంద్రాలు, ఒక ఆక్వా బిజినెస్ స్కూల్, మత్స్యకార రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేస్తారు.

ఈ కార్యక్రమాల ద్వారా సుందర్‌గఢ్ జిల్లా వ్యాప్తంగా కమ్యూనిటీల సామాజిక-ఆర్థిక అభివృద్ధికి తోడ్పడటంతో పాటు నీటి వనరుల నిర్వహణను బలోపేతం చేయటం, స్థిరమైన ఉపాధి అవకాశాలను ప్రోత్సహించటం, మహిళల నేతృత్వంలోని వ్యాపారాలకు మద్దతివ్వటం ఎంసీఎల్ లక్ష్యంగా పెట్టుకుంది.

# జూనియర్ సివిల్ జడ్జీలుగా బ్రాహ్మణపల్లి బిడ్డలు

## ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలకు న్యాయమూర్తులుగా అవకాశం

కరీంనగర్, అక్టోబర్ 16: తెలంగాణ హైకోర్టు ఇటీవల విడుదల చేసిన ఫలితాలలో పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి స్వగ్రామానికి చెందిన ఇద్దరు ఎంపికయ్యారు. వేముల లక్ష్మి వైకుంఠం దంపతుల కుమార్తె వేముల హారిక, చిప్ప లత రాజేశ్వర్ దంపతుల కుమార్తె చిప్ప సౌమ్య జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపికయ్యారు. జడ్జీలుగా ఎంపికైన వారి తండ్రుల స్వస్థలం బ్రాహ్మణపల్లి కాగా వృత్తి రీత్యా ఇతర ప్రాంతాలలో పని చేశారు. కాగా బ్రాహ్మణపల్లి గ్రామానికి వచ్చిన ఇద్దరు మహిళలు జడ్జీలుగా ఎంపిక కావడం పట్ల పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు చిప్ప భాస్కర్ హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# మౌలిక సదుపాయాలు కల్పిస్తాం..

## రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

## అర్బన్ హౌసింగ్ కాలనీలో అభివృద్ధి పనులు

## రూ.2.77 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన

కరీంనగర్, అక్టోబర్ 16:జగిత్యాల అర్బన్ హౌసింగ్ కాలనీలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. శు



క్రవారం జగిత్యాల అర్బన్ హౌసింగ్ కాలనీలో రూ.2.77 కోట్ల నిధులతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. అర్బన్ హౌసింగ్ కాలనీలో నివసిస్తున్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించాలనే ఉద్దేశంతో రూ.2.77 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడం ద్వారా కాలనీలో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడటంతో పాటు ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించేందుకు కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. అర్బన్ హౌసింగ్ కాలనీలో నివసిస్తున్న ప్రజల్లో ఇప్పటివరకు గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ప్రయోజనం పొందని వారు సంబంధిత అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకొని పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా కాలనీలోని ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అన్ని వర్గాల వారికి ప్రార్థనా స్థలాలు ఏర్పాటు చేసే అంశంపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. హిందూ సోదరులకు దేవాలయం, ముస్లింలకు మసీదు, క్రైస్తవులకు చర్చి ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కాలనీలో సెల్ ఫోన్ సిగ్నల్ సమస్య ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఈ సమస్య పరిష్కారానికి మొబైల్ టవర్ ఏర్పాటు చేసేలా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాలనీలో నివసించే ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో బస్సు సర్వీసును ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. విద్యుత్, రవాణా, కమ్యూనికేషన్ తదితర మౌలిక సదుపాయాలతో పాటు ప్రజలకు అవసరమైన ఇతర సౌకర్యాలను కూడా దశలవారీగా కల్పిస్తామని చెప్పారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటూ, ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ అర్బన్ హౌసింగ్ కాలనీలో నివసిస్తున్న ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కాలనీలో విద్యుత్ సరఫరా మెరుగుపరిచేందుకు రూ.2.77 కోట్లతో సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టడం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రజల రవాణా సౌకర్యార్థం బస్సు సర్వీసును ప్రారంభించడం ద్వారా కాలనీ వాసులకు రాకపోకలు సులభతరం అవుతాయని తెలిపారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందేలా చూడాలని సూచించారు. కాలనీలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతూ కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అర్బన్ హౌసింగ్ కాలనీలో రూ.2.77 కోట్లతో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలనీలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

# విజయవాడలో జాతీయ సరస్ మేళాలో పాల్గొన్న రాష్ట్రపతి



న్యూ ఢిల్లీ, అక్టోబర్ 16:జాతీయ సరస్ మేళాలో రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము పాల్గొన్నారు. జాతీయ సరస్ మేళాను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కలిసి విజయవాడలో ఈ రోజు ఏర్పాటు చేశాయి. సరస్ స్టాళ్లను రాష్ట్రపతి సందర్శించి, లఖ్‌పతి దీదీలతో సంభాషించారు.

రాష్ట్రపతి ప్రసంగిస్తూ, వ్యవసాయంలో గ్రామీణ మహిళలదే కీలక పాత్ర అన్నారు. వారు స్వయంసహాయక బృందాల (ఎస్‌హెచ్‌జీస్) ద్వారా ఆర్థిక, సాంకేతిక, సామాజిక సాధికారత సాధనకు కొత్త మార్గాన్ని కనుగొన్నారని శ్రీమతి ద్రౌపది ముర్మ అన్నారు. మహిళలకు సాధికారతను కల్పించడంలో ఉత్సాహకర వృద్ధి నమోదవడమే కాక, ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడంలో వారి భాగస్వామ్యం పెరిగిందని కూడా తెలిసి సంతోషిస్తున్నట్లు రాష్ట్రపతి తెలిపారు. ఇది భారత్ సమానావకాశాలను అందించే, అన్ని వర్గాలకు భాగస్వామ్యాన్ని పంచే తరహా అభివృద్ధిని సాధించడానికి ఎంతో అవసరమన్నారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మహిళా స్వయంసహాయ బృందాలు ప్రభావవంతమైన తోడ్పాటును అందించినట్లు రాష్ట్రపతి తెలిపారు. గత 12 సంవత్సరాల్లో ఈ బృందాలతో అనుబంధాన్ని ఏర్పరుచుకున్న మహిళల సంఖ్య 10 కోట్లకు మించిందని వెల్లడించారు. ఈ మహిళలు 90 లక్షలకు పైబడిన స్వయంసహాయ బృందాలతో ముడిపడి, కుటుంబాల ఆర్థిక అభ్యున్నతికి సార్థక తోడ్పాటును అందిస్తున్నారని రాష్ట్రపతి అన్నారు. ఆ భాగస్వామ్య ప్రక్రియ మహిళలు కేంద్ర స్థానంలో నిలబడుతున్న, సమ్మిళితమైన గ్రామీణ అభివృద్ధికి దోహదం చేస్తోందని శ్రీమతి ద్రౌపది ముర్ము అన్నారు. సామూహిక వాణిజ్య వ్యవస్థకు సంబంధించిన అవకాశాలు పెద్ద ఎత్తున విస్తరించడానికి ఈ పరిణామం తోడ్పడిందన్నారు.

సామాజిక కార్యకలాపాల్లో మహిళా స్వయంసహాయక బృందాలు ప్రధాన పాత్ర పోషిస్తుండడం సంతోషదాయకమని రాష్ట్రపతి అన్నారు. గ్రామీణ జీవితం సమగ్రంగా పరివర్తన చెందడానికి, మన దేశ అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాల వారి చెంతకు చేరడానికి ఎస్‌హెచ్‌జీలు గొప్ప తోడ్పాటును అందిస్తున్నాయని శ్రీమతి ద్రౌపది ముర్ము అన్నారు.

'లఖ్‌పతి దీదీ' కార్యక్రమాన్ని ప్రభుత్వం తీసుకువచ్చి గ్రామీణ మహిళలకు సాధికారతను కల్పించడానికి ప్రత్యేక వేగాన్ని, దిశను సమకూర్చిందని రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము అన్నారు. డిజిటల్ సేవలు, పునరుత్పాదక ఇంధనం వంటి వివిధ ఆధునిక రంగాల్లో భాగస్వామ్యం రోజు రోజుకు పెరుగుతుండటంతో, గ్రామీణ ప్రాంతాల మహిళలకు నైపుణ్యాభివృద్ధికి సంబంధించిన కొత్త దారులు తెరుచుకుంటున్నాయని రాష్ట్రపతి అన్నారు.

గ్రామీణ ప్రాంతాల మహిళలు పథకాలకు ప్రస్తుతం లబ్ధిదారులుగా మాత్రమే లేరని, సంపదను సృష్టించేవారుగాను, అభివృద్ధికి సారథులుగాను మారారని రాష్ట్రపతి ప్రశంసించారు. ఇంత జరుగుతున్నా, మనం సాధికారత కల్పన యాత్రలో పయనించవలసిన దూరం ఇంకా ఎంతో మిగిలే ఉందని శ్రీమతి ద్రౌపది ముర్ము అన్నారు. గ్రామీణ ప్రాంతాల మహిళలు సొంత ఆదాయంపై, ఆస్తులపై ఎంతవరకు నియంత్రణను సాధించగలిగారనేది కూడా సాధికారత కల్పనకు సంబంధించిన ఒక కీలక ప్రమాణంగా మారాలి అని రాష్ట్రపతి అన్నారు. దీంతోపాటు, గృహ సంరక్షణ బాధ్యతలలో సహకారపూర్వక సాముదాయిక వ్యవస్థలను ప్రోత్సహించవలసిన అవసరం ఉందన్నారు. వాతావరణ మార్పులను తట్టుకొని నిలవగలిగిన వాణిజ్య సంస్థలలో గ్రామీణ మహిళల భాగస్వామ్యం తప్పక వృద్ధి చెందాలని కూడా శ్రీమతి ద్రౌపది ముర్ము అన్నారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టపరిచే వేదికలుగా సరస్ మేళాలు మారుతున్నాయని రాష్ట్రపతి అన్నారు. ఈ మేళాలు అంతకంతకు వృద్ధి చెందుతున్న గ్రామీణ మార్కెట్లుగా నిలదొక్కుకున్నాయన్నారు. వాటితో గ్రామీణ మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, దేశవ్యాప్త వినియోగదారులకు మధ్య ప్రత్యక్ష బంధం బలోపేతమైందన్నారు. 2047 కల్లా అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యాన్ని సాధించాలంటే, అభివృద్ధి ఫలాలను ప్రతి పల్లెకు, ప్రతి కుటుంబానికి చేర్చడం అత్యంత అవసరం అని శ్రీమతి ద్రౌపది ముర్ము స్పష్టం చేశారు. ఈ ప్రయత్నంలో ఎస్‌హెచ్‌జీలు, సరస్ మేళాలు ముఖ్య పాత్రను పోషించగలుగుతాయని రాష్ట్రపతి తెలిపారు.

34 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి సుమారు 1500 మహిళా స్వయం సహాయక బృందాలకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పాటు లఖ్‌పతి దీదీలు వారి వారి ఉత్పాదనలను జాతీయ సరస్ మేళాలోని తాజా సంచికలో ప్రదర్శిస్తున్నారు. 650 కన్న ఎక్కువ స్టాల్స్‌ను ఈ మేళాలో ఏర్పాటు చేశారు. మేళాను ఈ నెల 31 వరకు తెరిచి ఉంచుతారు.

# డ్రైవర్ సీటు వెనుక సీక్రెట్ క్యాబిన్.. పోలీసులకే దిమ్మతిరిగిన షాక్!

## కంటైనర్ లారీలో 140 కేజీల గంజాయి స్వాధీనం

## రూ.70 లక్షల విలువైన గంజాయి పట్టివేత.. ఇద్దరు అదుపులోకి

## రహస్య క్యాబిన్‌లో గంజాయి తరలింపు

## ఈగల్ టీమ్, కశింకోట పోలీసుల సంయుక్త ఆపరేషన్

అమరావతి, అక్టోబర్ 16: గంజాయి అక్రమ రవాణాపై అనకాపల్లి జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపారు. కశింకోట పోలీసులు, ఈగల్ టీమ్ సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో




సుమారు రూ.70 లక్షల విలువైన 140 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన కంటైనర్ లారీతో పాటు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని, ఇద్దరిని పట్టుకున్నారు. ఒడిశా నుంచి గంజాయిని సేకరించి రాజస్థాన్‌కు తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

ఈ నెల 15న కశింకోట పోలీస్ స్టేషన్ సీఐ ఎ. స్వామి నాయుడుకు అందిన విశ్వసనీయ సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. జాతీయ రహదారి-16పై కశింకోట సమీపంలోని హెచ్‌పీ హోటల్ ఎదురుగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో జీజే 01 డీజెడ్ 7861 నంబరు గల కంటైనర్ లారీని ఆపగా, అందు లో ఉన్న ఇద్దరు వ్యక్తులు పారి పోయేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. వారిలో లారీ డ్రైవర్ సద్దాం హుస్సేన్‌తో పాటు 17 ఏళ్ల బాలుడు ఉన్నాడు.

లారీని క్షుణ్ణంగా తనిఖీ చేయగా, డ్రైవర్ సీటు వెనుక భాగంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రహస్య క్యాబిన్‌ను పోలీసులు గుర్తించారు. అందులో 28 ప్యాకెట్లలో దాచిన మొత్తం 140 కేజీల గంజాయి బయటపడింది. గంజాయితో పాటు కంటైనర్ లారీ, ఒక ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్, ఒక కీప్యాడ్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

### రాజస్థాన్ నుంచి ఒడిశా వరకు నెట్‌వర్క్

ప్రాథమిక విచారణలో రాజస్థాన్‌కు చెందిన కిసాన్ అలియాస్ కిషన్ జీ అలియాస్ కిషన్ జాట్ అనే వ్యక్తి ఆదేశాల మేరకు నిందితులు ఒడిశాలో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి గంజాయిని స్వీకరించినట్లు వెల్లడైంది. అనంతరం మర్రిపాలెం టోల్‌ప్లాజా సమీపంలోని లే-బై రోడ్డులో లారీ రహస్య క్యాబిన్‌లో గంజాయిని దాచి రాజస్థాన్‌కు తరలించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ అంతర్రాష్ట్ర ముఠాలోని ఇతర నిందితులు, గంజాయి సరఫరాదారుల వివరాలను తెలుసుకునేందుకు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు కొనసా గిస్తున్నారు.

ప్రధాన నిందితుడు సద్దాం హుస్సేన్‌ను అరెస్టు చేసి విశాఖపట్నం కేంద్ర కారాగారానికి రిమాండ్‌పై తరలించారు. చట్టంతో సంఘర్షణలో ఉన్న బాలుడిని విశాఖపట్నం జువెనైల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరుపరిచారు.

### గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ.. అనకాపల్లి జిల్లాను గంజాయి, మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే పోలీసుల లక్ష్యమని తెలిపారు. అక్రమ రవాణా దారులు ఎంతటి అధునాతన పద్ధతులు అనుసరించినా పోలీసుల నిఘా నుంచి తప్పించు కోలేరని స్పష్టం చేశారు. గంజాయి సాగు, నిల్వ, రవాణా, కొనుగోలు, విక్రయాల్లో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాల్గొనే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అలవాటుగా నేరాలకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ ప్రయోగించడంతో పాటు అక్రమంగా సంపాదించిన ఆస్తులను జప్తు చేసే చర్యలు చేపడతామని తెలిపారు. యువత భవిష్యత్తును దెబ్బతీసే మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. గంజాయి రవాణాకు సంబంధించిన సమాచారం తెలిస్తే నిర్భయంగా పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. గంజాయి రవాణాను సకాలంలో అడ్డుకున్న కశింకోట సీఐ ఎ. స్వామి నాయుడు, ఈగల్ టీమ్ సభ్యులు, పోలీసు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. ఈ మీడియా సమావేశంలో అదనపు ఎస్పీ ఎల్. మోహనరావు, అనకాపల్లి సబ్‌డివిజన్ డీఎస్పీ పి.వీ.వీ. నరసింహారావు, ఎస్‌బీ డీఎస్పీ వి. బాబ్జీరావు, సీఐ స్వామి నాయుడు, ఈగల్ టీమ్ ఇన్‌స్పెక్టర్ నారాయణరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఈఎస్‌టీఐసీ-2026 కి ముందు పరిచయ కార్యక్రమంతోపాటు

# ప్రసార మాధ్యమాలతో చర్చ కార్యక్రమాన్ని నిర్వహించనున్న ఐసీఏఆర్

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 16:భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) రేపు, అంటే 2026 అక్టోబర్ 15న, హర్యానాలోని కర్నాల్‌లో గల ఐసీఏఆర్-సెంట్రల్ సాయిల్ సెలైనిటీ రిసర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎస్ఎస్ఆర్ఐ)లో ఓ పరిచయ కార్యక్రమాన్ని, ప్రసార మాధ్యమాలతో చర్చ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఈ నెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్.. భారత్ మండపంలో 'ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ, ఇన్నొవేషన్ కాన్‌క్లేవ్ (ఈఎస్‌టీఐసీ)-2026'ను నిర్వహించనున్నారు. కాగా ఆ సమావేశానికి ముందు సన్నాహక చర్యగా రేపటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఈఎస్‌టీఐసీ-2026 పరిచయ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన, విద్య విభాగం (డీఏఆర్ఈ) కార్యదర్శి, ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎమ్.ఎల్. జట్ ప్రసంగించనున్నారు. ఆయన ఈఎస్‌టీఐసీ-2026 లో ఐసీఏఆర్ పాత్రను వివరిస్తారు.

ఈ కార్యక్రమంలో 'వ్యవసాయ సాంకేతికత, ఆహార వ్యవస్థలు, పోషణ' అంశాలపై ప్రసార మాధ్యమాలతో చర్చను కూడా చేపడతారు. ఈ కార్యక్రమం వ్యవసాయ సాంకేతికత, ఆహార వ్యవస్థలు, పోషణ రంగాల్లో తాజా పరిణామాలపై చర్చలకు ఒక వేదికను సమకూర్చనుంది.

ఈఎస్‌టీఐసీ-2026 లో ఐసీఏఆర్ భూమిక

ఈఎస్‌టీఐసీ-2026 సారథ్య సంఘంలో వ్యవసాయ పరిశోధన, విద్య విభాగం (డీఏఆర్ఈ) కార్యదర్శి, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్‌కు సభ్యత్వం ఉంది. కేంద్ర ప్రభుత్వంలోని ప్రముఖ విజ్ఞానశాస్త్ర, సాంకేతిక విభాగాల అధిపతులు కూడా ఈ సంఘంలో సభ్యులుగా ఉన్నారు. "వ్యవసాయం, ఆహార వ్యవస్థలు, పోషణ" ఇతివృత్తంపై ఏర్పాటు చేయబోయే సమావేశంతో ఐసీఏఆర్ ప్రత్యక్ష అనుబంధాన్ని కలిగి ఉంటుంది. దీనిని ఈఎస్‌టీఐసీ-2026 కు చెందిన 12 కీలక ఇతివృత్తాల సమావేశాల్లో ఒకటిగా 2026 అక్టోబర్ 29న నిర్వహించనున్నారు. సమావేశానికి ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖ (ఎమ్ఓఎఫ్‌పీఐ) కార్యదర్శితో పాటు డీఏఆర్ఈ కార్యదర్శి, ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ అధ్యక్షత వహిస్తారు. దీనిలో ఓ కీలకోపన్యాసం, నూతన సాంకేతికతలపై పనిచేస్తున్న ఒక కొత్త వాణిజ్య సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ), ఒక మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్త, విజ్ఞానశాస్త్ర, సాంకేతిక రంగాల్లోని ప్రముఖ వ్యక్తులు ఇచ్చే నివేదికలు, ఆ తరువాత బృంద చర్చ కార్యక్రమం చోటు చేసుకుంటాయి. ఈ సమావేశంలో భారత్‌లోని విస్తృత విజ్ఞానశాస్త్ర, సాంకేతిక రంగాలకు చెందిన వ్యవసాయ పరిశోధన, నూతన ఆవిష్కరణలు, సరికొత్త సాంకేతికతల తోడ్పాటును వివరించడానికి ఒక అవకాశాన్ని ఇస్తారు. ఐసీఏఆర్-జాతీయ ప్లాంట్ బయోటెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్, ఐసీఏఆర్-జాతీయ వరి పరిశోధన సంస్థల పరిశోధకులతో పాటు అనేక మంది ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు ఈఎస్‌టీఐసీ-2026 లో ప్రసంగిస్తారు. కృత్రిమ మేధ (ఏఐ), రోబోటిక్స్, డిజిటల్ ఆధారిత వ్యవసాయం, ఆధునిక పద్ధతుల్లో ఫలసాయం మెరుగుదల, జీన్ ఎడిటింగ్, సుస్థిర ప్రాతిపదిక కలిగిన వ్యవసాయ వ్యవస్థల్లో పురోగతి ఎంతవరకు వచ్చిందో ఈ సందర్భంగా ఐసీఏఆర్ వివరించనుంది. దీనికి అదనంగా, ఐసీఏఆర్ "వ్యవసాయ సాంకేతికత, ఆహార వ్యవస్థలు, పోషణ" ఇతివృత్తంలో భాగంగా తన నూతన ఆవిష్కరణలను కూడా ఈఎస్‌టీఐసీ-2026 ప్రదర్శనలో కళ్లకు కట్టనుంది.

ఈఎస్‌టీఐసీ-2026

ఇది విజ్ఞానశాస్త్రం, సాంకేతికత, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ఏర్పాటు చేసిన ఒక ప్రధాన వేదిక. ఇది వివిధ ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాల ప్రతినిధులు, పరిశోధకులు, డీప్-టెక్ అంకుర సంస్థలు, పరిశ్రమలు, విధాన రూపకర్తలు, ఆర్థిక సహాయ సంస్థలు, ప్రపంచ నిపుణులను ఏకతాటిమీదకు తీసుకు వస్తుంది. మూడు రోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమాన్ని విజ్ఞానశాస్త్ర, సాంకేతికత మంత్రిత్వ శాఖ అధీనంలోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్, ఇండస్ట్రియల్ రిసర్చ్ (సీఎస్ఐఆర్) ద్వారా కేంద్ర ప్రభుత్వ ప్రధాన విజ్ఞానశాస్త్ర సలహాదారు కార్యాలయం మార్గదర్శకత్వంలో నిర్వహిస్తారు. నేషనల్ ఇంటర్‌డిసిప్లినరీ సైన్స్, టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ (ఎన్ఐఐఎస్‌టీ) ఈ కార్యక్రమ నిర్వహణలో భాగస్వామ్యాన్ని పంచుకొంటుంది. ఈ కార్యక్రమం 2047 కల్లా వికసిత్ భారత్ దృష్టికోణాన్ని సాకారం చేసే దిశగా పురోగతిని సాధించడానికి వీలుగా అత్యాధునిక పరిశోధన, సరికొత్త సాంకేతికతల, సాంకేతికత ఆధారిత నూతన ఆవిష్కరణల రంగాల్లో సహకారాన్ని పెంపొందింపచేసేందుకు అవకాశాలను అందిస్తుంది.

ఈ సమావేశంలో పాల్గొనే వారిలో అణు ఇంధన విభాగం (డీఏఈ), ఆయుష్ శాఖ, బయోటెక్నాలజీ విభాగం (డీబీటీ), శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన విభాగం (డీఎస్‌టీ), రక్షణ విభాగం/డీఆర్‌డీఓ, పృథ్వీ విజ్ఞానశాస్త్రాల శాఖ (ఎమ్ఓఈఎస్), ఉన్నత విద్య విభాగం, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికత శాక (ఎమ్ఈఐటీవై), ఐసీఏఆర్, ఆరోగ్య పరిశోధన విభాగం (డీహెచ్ఆర్)/ ఆరోగ్య పరిశోధన విభాగం (డీహెచ్ఆర్)/భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎమ్ఆర్), అంతరిక్ష విభాగం/ఇస్రో, టెలికమ్యూనికేషన్స్ విభాగం (డీఓటీ)ల ప్రతినిధులు ఉన్నారు. వీరితో పాటు నోబెల్ పురస్కారాల విజేతలు, ప్రపంచ నిపుణులు, పారిశ్రామిక రంగ ప్రముఖులు, విధాన రూపకర్తలు, శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన రంగంలో ఎదుగుతున్న నేతలు, పరిశోధకులు, నూతన ఆవిష్కర్తలు, డీప్-టెక్ అంకుర సంస్థలు, పరిశ్రమలు, ఆర్థిక సహాయ సంస్థలు కూడా పాల్గొంటాయి.

ఈఎస్‌టీఐసీ-2026 లో ఐసీఏఆర్ భాగం పంచుకోవడం వల్ల, 2047 కల్లా అభివృద్ధి చెందిన భారత్‌ను ఆవిష్కరించాలన్న ఆశయానికి అనుగుణంగా మన్నికైన, సాంకేతికతపై ఆధారపడే వ్యవసాయ, ఆహార వ్యవస్థలను ప్రోత్సహించడానికి కలిసివచ్చే ప్రయత్నాలను బలోపేతం చేయడంలో తోడ్పాటు లభించనుంది.

# సింగరేణి కార్మికులు చనిపోతే పట్టించుకోని కేసీఆర్: మంత్రి అడ్లూరి లక్ష్మణ్



జగిత్యాల, అక్టోబర్16: సింగరేణి సంస్థపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య వాడివేడిగా మాటల యుద్ధం కొనసా గుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలపై తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విరుచు కుపడ్డారు. శుక్రవారం జగిత్యాలలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణి కార్మికులు చనిపోతే కేసీఆర్ పట్టించుకోలేదని విమర్శించారు. మీ ప్రభుత్వ హయాంలో ఒక్క సింగరేణి గనిని అయినా పరిశీలించారా.. అంటూ ఆ పార్టీ అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్‌లను ఆయన సూటిగా ప్రశ్నించారు. సింగరేణికి గడ్డం పెంచుకుని వస్తే లాభం ఏమిటీ అని కేటీఆర్‌ను ఆయన నిలదీశారు.

కేసీఆర్‌ను జగిత్యాల మాజీ ఎమ్మెల్యే టి. జీవన్ రెడ్డి తిట్టినట్లు ఎవరూ తిట్టలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో లక్ష కోట్ల రూపాయిల అవినీతి జరిగిందని గతంలో జీవన్ రెడ్డి ఆరోపించలేదా.. అని గుర్తు చేశారు. అంతేకాదు బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌ను జీవన్ రెడ్డి దెయ్యం, భూతం అని అభివర్ణించారని వివరించారు.

# సత్యాన్వేషణే ఆయన ధర్మం – చరిత్ర రచన ఆయన తపస్సు.

ఆంధ్రుల చరిత్రను శాస్త్రీయ పద్ధతిలో ఆవిష్కరించిన ప్రథమ చరిత్రకారుడు, నిర్భయ పత్రికా సంపాదకుడు, సమగ్ర రచయితగా ప్రసిద్ధి పొందిన చిలుకూరి వీరభద్రరావు తెలుగు జాతి ఆత్మగౌరవ చరిత్రలో ఒక శాశ్వత స్తంభం. ఆయన చరిత్ర పరిశోధన కేవలం శాస్త్రీయ కృషి మాత్రమే కాకుండా, ఒక జాతి ఆత్మను మేల్కొలిపిన పునాదిగా నిలిచింది. ఆంధ్రుల మూలాలు, సంస్కృతి, సాహిత్యం, రాజకీయం అన్నింటినీ సమగ్రంగా ఆవిష్కరించడానికి తన జీవితాన్ని అంకితం చేసినందుకే ఆయనను "ఆంధ్ర చరిత్ర చతురానన"గా గౌరవించారు.

1872 అక్టోబర్ 17న పశ్చిమ గోదావరి జిల్లాలోని రేలంగి గ్రామంలో ఒక పేద కుటుంబంలో జన్మించిన వీరభద్రరావు చిన్నతనం నుంచే అసాధారణ మేధస్సును ప్రదర్శించారు. ఆ కాలంలో ఇంగ్లిష్ విద్య ఒక కొత్త దారిని చూపిస్తున్నప్పుడు, ఆయన పాశ్చాత్య విద్యతో పాటు భారతీయ సంస్కృతిని గుండెల్లో దాచుకున్నారు. విద్యార్జనతో పాటు ఆయనలో దేశభక్తి భావం మేల్కొంది. కష్టసాధ్యమైన పరిస్థితుల్లోనూ విద్యపై అపారమైన ఆసక్తితో సంస్కృతం, ఆంధ్ర భాషల్లో ప్రావీణ్యం సాధించారు. ఆయన విద్యార్జన కేవలం పుస్తక పరిధిలో మాత్రమే కాకుండా చుట్టూ ఉన్న సమాజాన్ని పరిశీలించి అర్థం చేసుకునే లోతైన జ్ఞానాన్వేషణగా మారింది.

వీరభద్రరావు వృత్తి ప్రారంభం పత్రికా సంపాదకత్వంలో జరిగింది. ఆ కాలంలో పత్రికలు ప్రజల్లో చైతన్యం కలిగించడంలో ప్రధాన పాత్ర పోషించేవి. ఆయన పనిచేసిన దేశోపకారి, ఆంధ్ర దేశాభిమాని, విబుధ రంజని, ఆంధ్రకేసరి, సత్యవాది వంటి పత్రికలు జాతీయోద్యమానికి, ఆత్మగౌరవ ఉద్యమానికి వేదికలుగా నిలిచాయి. ఆయన రచనలు నిష్పక్షపాతంగా, నిర్భయంగా ఉండేవి. ఏదైనా సామాజిక అన్యాయం, రాజకీయ మోసం, విద్యా వెనుకబాటు గమనించినప్పుడు ఆయన కలం ధర్మ యోధునిలా స్పందించేది. ఆ కాలంలో తెలుగునాట పత్రికా సంపాదకత్వం అంటే కేవలం వ్యాసరచన కాదు ? ప్రజా చైతన్యానికి దిశానిర్దేశం. ఆ పాత్రను ఆయన అత్యంత సమర్థంగా నిర్వర్తించారు.

అయితే ఆయన ఖ్యాతికి మూలం పత్రికా రంగం కాక, చరిత్ర పరిశోధనే. ఆంధ్రుల చరిత్ర రచనకు ఆయన చేసిన కృషి అసమానము. 1909 నుండి 1912 వరకు మద్రాసు (చెన్నై)లో నివసిస్తూ ఆయన ఐదు సంపుటాల ఆంధ్రుల చరిత్ర గ్రంథాన్ని రచించారు. విజ్ఞాన చంద్రికా మండలి ప్రచురించిన ఈ గ్రంథాలు తెలుగువారి జాతీయ చైతన్యానికి మూల స్తంభాలయ్యాయి. చరిత్రను కేవలం వృత్తాంతాల సమాహారంగా కాకుండా, ఆంధ్రుల ఆవిర్భావం, వలసలు, రాజకీయ వ్యవస్థ, సంస్కృతి, భాష, సాహిత్యం, సామాజిక నిర్మాణం వంటి అన్ని కోణాల నుండి విశ్లేషించిన ఆయన కృషి ఆధునిక చరిత్రా రచనకు మార్గదర్శకం అయింది.

ఆయన పరిశోధనా వైఖరి పూర్తిగా స్వతంత్రంగా ఉండేది. నిజాన్ని నిర్భయంగా చెప్పడం ఆయన ధర్మంగా భావించేవారు. తన సిద్ధాంతాలను నిరూపించడానికి ఆరోగ్యం, ఆస్తి, సమాజ ఒత్తిడిని కూడా లెక్క చేయకుండా పరిశోధనలో తలమునకలయ్యారు. "సత్యమే సత్పరిశోధన లక్షణం" అనే నమ్మకంతో ఏ మూలాధారాన్నీ అనవసరంగా తిరస్కరించకుండా శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేశారు.

### అక్టోబర్ 17...ఆంధ్ర చరిత్ర చతురానన చిలుకూరి వీరభద్రరావు జయంతి



ఆంధ్రుల చరిత్ర ప్రచురణ అనంతరం ఆయన సిద్ధాంతాలు విస్తృత చర్చలకు దారితీశాయి. ఆ కాలంలో చరిత్రా గ్రంథాల సంఖ్య తక్కువగా ఉండటంతో ఆయన పద్ధతి కొత్తదిగా, కొందరికి వివాదాస్పదంగా అనిపించింది. కొంతమంది పండితులు ఆయన నిర్ధారణలపై విమర్శలు చేశారు; కొంతమంది పుస్తక రూపంలో ప్రతివాదాలు కూడా రాశారు. అయినప్పటికీ, ఆంధ్ర చరిత్రను శాస్త్రీయ పద్ధతిలో స్థాపించడానికి మొదటి అడుగు ఆయనదే. అందుకే 1928లో నంద్యాలలో జరిగిన ఆంధ్ర మహాసభలో సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యక్షతన ఆయనను "ఆంధ్ర చరిత్ర చతురానన" అనే బిరుదుతో సత్కరించారు. ఈ బిరుదు ఆయన కీర్తికి మకుటం ధరింప చేసినట్లయింది.

వీరభద్రరావు రచనా ప్రస్థానం విస్తృతమైనది. ఆంధ్రుల చరిత్రతో పాటు ఆయన రాజమహేంద్రపుర చరిత్రము, జీర్ణ కర్ణాట రాజ్య చరిత్రము, తిక్కన సోమయాజి, తిమ్మరుసు మంత్రి, శ్రీనాథ కవి, శివాజీ చరిత్ర, వరలక్ష్మీ విలాసము, హిందూ సంసారము వంటి అనేక గ్రంథాలను రచించారు. ఆయన రచనలు వాస్తవాధారితమైనవి, చరిత్రలో వ్యక్తుల ప్రాముఖ్యతను నిష్పాక్షికంగా చిత్రించినవి. ఆయన చరిత్రను కేవలం రాజుల వృత్తాంతంగా కాకుండా ప్రజల జీవన స్రవంతిగా చూపారు. ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ప్రసంగాలు, వ్యాసాలు, పాఠశాలల్లో సదస్సులు నిర్వహించారు. ఆయన ప్రేరణతో అనేక గ్రామాల్లో విద్యా కేంద్రాలు, గ్రంథాలయాలు స్థాపించబడ్డాయి. ఆయన సాహిత్య విమర్శకుడిగానూ పేరుపొందారు. కట్టమంచి రామలింగారెడ్డి వంటి ప్రముఖ విమర్శకులు వీరభద్రరావు గారి విమర్శన దృష్టిని ప్రశంసించారు. ఆయన వాక్యనిర్మాణం, భాషా పటిమ, విశ్లేషణా గాంభీర్యం తెలుగు శాస్త్రీయ రచనలో ఒక కొత్త దారిని చూపించాయి.

వీరభద్రరావు అధికార, పదవుల పట్ల అసక్తి చూపలేదు. తన కృషి విలువను కాలం గుర్తించక పోయినా, సత్యాన్వేషణలో తగ్గలేదు. పేదరికం, అనారోగ్యం, విమర్శలు ఆయనను కదిలించలేక పోయాయి. ఆయన జీవితం ఒక యజ్ఞం ? ఆంధ్రుల చరిత్ర యజ్ఞం. 1939లో ఆయన కన్ను మూశారు. కానీ ఆయన సృష్టించిన ఆంధ్రుల చరిత్ర గ్రంథం ఆంధ్ర భూమికి శాశ్వత వారసత్వంగా నిలిచింది. చిలుకూరి వీరభద్రరావు కృషి తరం తరాలకు ఆదర్శంగా నిలిచింది. విద్య, చైతన్యం, దేశభక్తి అనే మూడు స్తంభాలపై ఆయన జీవితం నిర్మించ బడింది.

ఆంధ్ర చరిత్ర ఉన్నంతకాలం చిలుకూరి వీరభద్రరావు పేరు నిలిచి ఉంటుంది. ఆయన పరిశోధనా పద్ధతి, రచనా ధోరణి, జ్ఞాన నిబద్ధత ఇవన్నీ నేటి చరిత్రకారులకు మార్గదర్శకంగా, ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఆంధ్రుల ఆత్మగౌరవ గాథకు ప్రాణం పోసిన చరిత్రకారుడు చిలుకూరి వీరభద్రరావే.



–రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## పండగ పూట ధరల మంట



కరీంనగర్, అక్టోబర్ 16:ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకునే బతుకమ్మ, దసరా పండుగల వేళ నిత్యావసరాల ధరలు పేద, మధ్య తరగతి వారిని హడలెతిస్తున్నాయి. నాలుగు నెలల కిందటి వరకు అందుబాటులో ఉన్న సరు కులు ఇప్పుడు చుక్కలు తాకుతుండడంతో ప్రతి నెలా ఇంటి బడ్జెట్ తలకిందులవుతోంది. స్వల్ప వ్యవధిలోనే బియ్యం ధరలు దాదాపు రెట్టింపయ్యా యి. ఎల్‌నినో ప్రభావంతో పంటల దిగుబడి అంతం తమాత్రంగానే ఉండడం, డిమాండ్ మేరకు సరకు లు రాకపోవడంతో వ్యాపారులు సైతం సంక్షోభ పరి స్థితులు ఎదుర్కొంటున్నారు.

కూరగాయలు మొదలు కొని నూనెలు, పప్పుల ధరలు ఆకాశన్నంటడంతో పండుగలు ఎలా చేసుకునేదని సామాన్య జనం వాపోతున్నారు. ప్రస్తుతం దసరా, దీపావళి పండుగలు వస్తున్న నేపథ్యంలో మార్కెట్‌లో ధరలు హడలెత్తిస్తున్నాయి. వంటింటి సరకుల ధరలు అమాంతం పెరగడంతో పేద, మధ్య తరగతి, సామాన్య ప్రజలు విలవిలలాడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండటం పంటలు చేతికొచ్చే సమయంలో వర్షాలు ముఖం చాటేయడంతో ఎల్‌నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. దీని ప్రభావం అన్ని రకాల వస్తువులపై పడటం, రాబోయే రోజుల్లో పరిస్థితి ఏ మేరకు ఉంటుందోనని ఇప్పటి నుంచే ఆందోళన మొదలవుతోంది

నెల రోజుల వ్యవధిలో సన్నబియ్యం ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. బియ్యం ధరలు రూ.1,500లకు పైగా పెరిగాయి. ఎల్‌నినో కారణంగా ఈ ధరలు మరింత పెరుగుతాయని ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేసిన తొలినాళ్లలో సన్నబియ్యం ధరలు దిగవచ్చాయి. ఆ తర్వాత మళ్లీ క్రమంగా పెరుగుతున్నాయి. వర్షాలు తక్కువగా కురవడం, ఎల్‌నినో కారణంగా భిన్నమైన వాతావరణ పరిస్థితులు చూస్తున్నాం. దానితో పాటు రేషన్ బియ్యాన్ని చాలా మంది తినడం లేదు. దీంతో నాణ్యమైన సన్నబియ్యానికి డిమాండ్ ఏర్పడింది.

నెల రోజులకు ముందు హెచ్‌ఎంటీ బియ్యం ధర క్వింటాల్‌కు రూ. 6,000–6, 300గా ఉండేది. జైశ్రీరాం బియ్యం ధర క్వింటాల్‌కు రూ. 6, 800–7,000లుగా పలికింది. ఇప్పుడు హెచ్ ఎంటీ ధర రూ.7,600– 7,800కు చేరింది. అదే జైశ్రీరాం క్వింటాల్ ధర రూ. 8,400–8,600లకు పెరి గింది. సాంబమసూరి ధర క్వింటాల్‌కు గతంలో రూ. 5,000 ఉండగా ప్రస్తుతం రూ.7,000లకు విక్రయిస్తున్నారు. ఈ ధరలు కూడా ప్రస్తుత సమయానికేనని విక్రయదారులు చెబుతు న్నారు. త్వరలో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

బియ్యం ధరలపై ప్రభుత్వంతో పాటు ధరల నియంత్రణ కమిటీలు కూడా కీలకంగా పని చేయాల్సి ఉంటుంది. కేవలం 50రోజుల్లోనే ధరలు ఈ విధంగా పెరిగిపోతే భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితి ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు సన్న బియ్యాన్ని రహస్యంగా నిల్వ చేసుకొని అధిక ధరలకు విక్రయించేందుకు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు ధరలను నియంత్రించి సామాన్య జనంపై భారం పడకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కూరగాయలు మొదలుకొని పప్పుధాన్యాలు, నూనెల ధరల పెరుగుదల మధ్యతరగతి ప్రజలపై అధిక భారం పడుతోంది. కూరగాయలు ఏ రకమైన కిలోకు రూ.80కి పైగా పలుకుతోంది. వారానికి సరిపడా కొంటే రూ.500లకు పైగా ఖర్చువుతోందని ప్రజలు వాపోతు న్నారు. అల్లం, ఉల్లి, వెల్లుల్లి ఇలా వంటింట్లో విని యోగించే ధరలు ఒక్కసారిగా పెరగడం సామాన్యులకు భారంగా మారింది.

కిలో చిక్కుడుకాయ ధర రూ. 160, మెంతికూర రూ.200, బీర రూ.50, పచ్చి మిర్చి రూ.120, సిమ్లా మిర్చి రూ.100, బెండకాయ రూ.80, గోబి రూ.80, టమాట రూ.50, ఉల్లి రూ.80, వెల్లుల్లి రూ.200 పలుకు తోంది. దీంతో వచ్చే దసరా దీపావళి పండుగలు ఎలా చేసుకోవాలో అర్థం కావడం లేదని పేద, మధ్య తరగతి ప్రజలు ఆందోళన చెందుతు న్నారు. ఇక పప్పు ధరల విషయానికొస్తే గతంలో కందిపప్పు 140ఉండగా, ప్రస్తుతం 160పలుకు తోంది. పెసర పప్పు100–120, శనగపప్పు 80–100, చక్కెర ధర 55–60లు పెరగడంతో సామాన్యులు ఊపిరి పీల్చుకోలేకపోతున్నారు.

## భర్తను చంపిన భార్య, ఆమె ప్రియుడికి మరణశిక్ష..
### హత్య చేసి పాముకాటుగా నమ్మించిన భార్య



న్యూఢిల్లీ, అక్టోబర్ 16:భర్తను హత్య చేసిన భార్యకు, ఆమె ప్రియుడికి జిల్లా కోర్టు మరణశిక్ష విధించింది. ఈ మేరకు శుక్రవారం మీరట్ జిల్లా కోర్టులో అడిషనల్ జడ్జి 12 అయిన జైవీర్ సింగ్ నగర్ శిక్ష ఖరారు చేశారు. ఉత్తర ప్రదేశ్, మీరట్‌లో ఈ తరహా శిక్ష ఖరారు కావడం రెండు రోజుల్లో ఇది రెండోది. మొదటి కేసులో కూడా భర్తను హత్య చేసినందుకు భార్య, ఆమె ప్రియుడికి మరణశిక్ష విధించింది మీరట్ జిల్లా కోర్టు. తాజా కేసులో మృతుడు అమిత్ కశ్యప్ కాగా.. అతడిని భార్య రవిత, ఆమె ప్రియుడు అమర్‌దీప్ కలిసి హత్య చేశారు.

ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి. గత ఏడాది ఏప్రిల్ 17న అమిత్ కశ్యప్‌ను అతడి భార్య రవిత, ఆమె ప్రియుడు అమర్‌దీప్ కలిసి గొంతు నులిమి హత్య చేశారు. అనంతరం అతడిని పాము కరవడం వల్లే చనిపోయాడని నమ్మించారు. ఈ విషయం అందరూ నమ్మేలా బెడ్ పక్కన ఒక పామును కూడా వదిలిపెట్టారు. అయితే, అతడు పాముకాటు వల్ల చావలేదని పోస్టుమార్టంలో తేలింది. అతడి ఒంటిపై పాము కాటు గాయాల్లేవని వైద్యులు అన్నారు. గొంతు నులమడం వల్లే అతడు మరణించాడని కూడా వైద్యులు ధృవీకరించారు.

దీంతో పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి విచారణ జరపగా.. రవిత, అమర్‌దీప్ వ్యవహారం బయటపడింది. వారే హత్య చేసినట్లుగా తేలింది. దీనిపై స్థానిక జిల్లా అడిషన్ కోర్టు–12లో విచారణ జరిగింది. దీనిపై విచారణ జరిపిన పోలీసులు 60 రోజుల్లోనే చార్జిషీటు దాఖలు చేశారు. ఇంతకాలం కోర్టులో విచారణ జరగగా.. పలువురు సాక్షులను విచారించి, ఇద్దరూ హత్యకు పాల్పడ్డట్లు గుర్తించారు. దీనిపై శుక్రవారం కోర్టు తీర్పు వెల్లడించింది. నిందితులు ఇద్దరూ వేర్వేరు జైళ్ల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జడ్జి వారి నేరం, శిక్ష గురించి ప్రశ్నించారు. తాము చేసిన పనికి పశ్చాత్తాప పడుతున్నామని చెప్పారు. కోర్టు ఏ శిక్ష వేసినా చట్టపరంగా అనుభవించడానికి తాను సిద్ధమేనని రవిత తెలిపింది. తనకు ముగ్గురు పిల్లలు ఉన్నారని, వారి బాధ్యతను ఇతరులు చూసుకుంటారని కోర్టుకు తెలిపింది. అమర్‌దీప్ మాత్రం తనకు వృద్ధ తల్లిదండ్రులు ఉన్నారని, వారి సంక్షేమం చూసుకునే విషయంలో ఇబ్బంది రాకుండా చూడాలని విజ్ఞప్తి చేశాడు.

అనంతరం ఇద్దరూ కన్నీళ్లు పెట్టుకున్నారు. అనంతరం వారికి మరణశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించింది. రెండు రోజుల క్రితమే మీరట్, బ్లూ డ్రమ్ మర్డర్ కేసులో నిందితులు రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లాకు కూడా మరణశిక్ష విధించిన సంగతి తెలిసిందే.

## అధికార మార్పిడి జరగాలన్న ప్రశాంత్ భూషణ్..
### ఆ వ్యాఖ్యలను వ్యతిరేకించిన అభిజీత్ దీప్కే




న్యూఢిల్లీ, అక్టోబర్ 16: చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తన పదవి నుంచి తొలగించాలని సీజేపీ, కాంగ్రెస్‌తో పాటు ఇతర విపక్ష పార్టీలు కూడా డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో పలువురు నేతలు మాట్లాడారు. ఆ సమయంలో సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ అధికార మార్పిడి కూడా జరగాలన్నారు. ఆ సమావేశంలో ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ నేత నేహా బోరా, కాక్రోచ్ జనతా పార్టీ ఫౌండర్ అభిజీత్ దీప్కే కూడా పాల్గొన్నారు. ప్రభుత్వం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేయడం ప్రజాస్వామ్యంలో నేరం కాదు అని, ఇప్పుడు పోరాటం అంతా అధికార మార్పిడి కోసమే అని ప్రశాంత్ భూషణ్ అన్నారు. అధికార మార్పిడి కోసం విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయని ప్రభుత్వం అంటోందని, కానీ ఎన్నికలను సజావుగా నిర్వహించాలని తాము పోరాటం చేస్తున్నామని, ఒకవేళ ఇదే తరహా క్రూరత్వం కొనసాగితే, అప్పుడు తప్పకుండా అధికార మార్పిడి జరుగుతుందని, అవును మా అందరికీ ప్రభుత్వం మారాలని ఉందని ఆయన అన్నారు. అధికార మార్పిడి కోసం బీజేపీ కూడా ఎన్నో ఉద్యమాలు చేపట్టిందని, కానీ ఇప్పుడు కుట్ర జరుగుతున్నట్లు ఆ పార్టీ ఆరోపించడం సమంజసం కాదు అని ఆయన పేర్కొన్నారు.

మీడియా సమావేశంలో ప్రశాంత్ భూషణ్ చేసిన అధికార మార్పిడి వ్యాఖ్యలను కాక్రోచ్ జనతా పార్టీ ఫౌండర్ అభిజీత్ దీప్కే తప్పుపట్టారు. తాము చేస్తున్న నిరసనలు కేవలం సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించడం కోసమే అని దీప్కే అన్నారు. అధికార, ప్రభుత్వ మార్పిడి తమ ఉద్దేశం కాదు అని తెలిపారు. అధికార మార్పిడి జరగాలని తాము చెప్పడం లేదని, ఆ దిశగా పనిచేయడం లేదని, సీఈసీ ఎన్నికలను రిగ్గింగ్ చేస్తున్నారని, తన తోటి ఎన్నికల కమిషనర్లను ఆయన పట్టించుకోవడం లేదని, సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా వినడం లేదని, ప్రస్తుతం సీఈసీని తొలగించి, నిష్పక్షపాతంగా కొత్త సీఈసీని నియమించాలని దీప్కే అన్నారు.

## 'ఉపాధ్యాయుల నిరాహార దీక్షకు తరలిరావాలి'
### –అధిక సంఖ్యలో పాల్గొనాలని టీఎస్‌యూటీఎఫ్ పిలుపు

ఖమ్మం, అక్టోబర్ 16: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 17న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సామూహిక నిరాహార దీక్షలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆ సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి అనుమోలు కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం మీనవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎర్రుపాలెం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఆర్‌టీఈ చట్టానికి ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఎన్‌ఈపీ–2020ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో జీవో నంబర్ 25ను రద్దు చేయడంతోపాటు పాఠశాలల విలీనం, మూసివేతను నిలిపివేయాలని కోరారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల భారం తగ్గించాలని, రెండో పీఆర్సీ అమలు చేయాలని, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు.మోడల్ స్కూల్స్, గురుకుల ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని, ఆరోగ్య పథకాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని, కేజీబీవీ, యూఆర్‌ఎస్‌లలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మధ్యతరగతి ఉద్యోగులపై పన్ను భారం తగ్గించాలని, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలని కోరారు.

## పుష్కరాల పనుల్లో జాప్యం వద్దు
### కోటిలింగాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలి..–జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



కరీంనగర్, అక్టోబర్ 16:రానున్న 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని, జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని కోటిలింగాల గ్రామంలో చేపడుతున్న పుష్కరాల అభివృద్ధి పనులు, ఆలయ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా పుష్కరాల అభివృద్ధి పనుల పురోగతి, ఆలయ నిర్మాణ పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

2027లో గోదావరి పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.పుష్కరాల సందర్భంగా భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని, అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలయ నిర్మాణ పనులను సైతం సమన్వయంతో వేగవంతం చేసి, పుష్కరాలు ప్రారంభమయ్యే నాటికి అన్ని పనులు పూర్తయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, మండల తహసీల్దార్ ఆర్. శేఖర్, వెల్గటూర్, ఎండపల్లి మండలాల అభివృద్ధి అధికారులు వెంకట ప్రసాద్, కృపాకర్, సర్పంచ్ పర్స కోటయ్య, ఈ ఈ రాజేష్, ఇరిగేషన్ ఏ ఈ ప్రవీణ్,ఆలయ ఈవో కాంతారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పుదరి రమేష్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మోహినీ అలంకారంలో జగన్మోహనాకారుడిగా దర్శనమిచ్చిన శ్రీ మలయప్పస్వామి




తిరుపతి, అక్టోబర్ 16: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజు శుక్రవారం ఉదయం శ్రీ మలయప్పస్వామి మోహినీ అవతారంలో జగన్మోహనాకారంలో దర్శనమిచ్చారు. మరో తిరుచ్చిపై శ్రీకృష్ణస్వామివారు అలంకృతులై భక్తులకు అభయమిచ్చారు.

మోహినీ అవతారం జగత్తును ఆవహించిన మాయామోహాలకు అతీతంగా భగవంతుని తత్త్వాన్ని గ్రహించాలనే ఆధ్యాత్మిక సందేశాన్ని అందిస్తుందని అర్చకులు వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, జానకీ దేవి, రంగశ్రీ, ఆనంద సాయి, దర్శన్, నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.